

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్త్రీశక్తి' పథకం 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకోవడం చారిత్రాత్మక మైలురాయి. చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉద్యోగ ఉపాధిలో ఆంధ్రప్రదేశ్ త్వరలో అగ్రస్థానంలో నిలవనుంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


బుధవారం 07.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 167 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## అమరావతి పనులు..ఇక జెట్ స్పీడ్



- నిర్మాణ సంస్థలకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం
- పనుల్లో అశ్రద్ధ. నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టీకరణ
- 152 ప్రాజెక్టులు.. 41 వేల మంది కార్మికులు
- ఐకానిక్ నిర్మాణాల్లో జాప్యం వద్దన్న సీఎం

**అమరావతి, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్)** : రాజధాని అమరావతిలో నెలకు రూ. 2 వేల కోట్ల విలువైన పనులు జరిగేలా ప్రణాళికతో పనిచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాజధాని అమరావతి పనులపై క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారులు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో సీఎం నెలవారీ సమీక్ష నిర్వహించారు. రాజధాని పరిధిలో చేపట్టిన 152 ప్రాజెక్టుల్లో 41 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు. పనుల పరోగతిని, ఆయా ప్రాజెక్టుల స్థితిగతులను అధికారులు వివరించారు. గడిచిన నెలలో రాజధానిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు చేసినట్టు చెప్పారు. వీటిని రూ. 2 వేల కోట్లకు తీసుకువెళ్లాలని సీఎం అన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు... ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును పట్టాలెక్కించాలన్నారు. దీని కోసం కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రాజధాని పనుల్లో ఎక్కడా అశ్రద్ధ, నిర్లక్ష్యం లేకుండా వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని చెప్పారు. ఐకానిక్ భవనాల నిర్మాణాల విషయంలో ఎక్కడా పనులు ఆలస్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సచివాలయ టవర్లు, అసెంబ్లీ భవనం ఐకానిక్‌గా ఉండాలన్నారు.

మిగతా 2లో...

## స్త్రీ శక్తికి.. 100 కోట్ల అడుగులు



- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. ఆర్థిక భరోసా
- రోజూ 24 లక్షల మంది మహిళలు పథకం వినియోగం
- ప్రయాణ ఖర్చుల భారం నుంచి భారీ ఊరట
- పథకాన్ని ఆదరిస్తున్న మహిళలకు సీఎం కృతజ్ఞతలు

2 లో

## ప్రకృతి ఒడిలో.. ప్రజలకు మధురానుభూతి

- నగరవనాలతో ఆహ్లాదకర వాతావరణం.. ఎకో టూరిజంతో ఉపాధి
- రాష్ట్రంలోని ఆరు నగరవనాలను ప్రారంభించిన పవన్ కళ్యాణ్
- నల్లమల నుంచి మారేడుమిల్లి వరకు పర్యాటకాభివృద్ధి
- గిరిజన యువతకు జీవనోపాధి అవకాశాలే లక్ష్యం



**అమరావతి, అక్టోబరు 6 (జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్ర ప్రజలను ప్రకృతిలో మమేకం చేసి, వారికి మరిచిపోని మధురానుభూతులను ఇవ్వడంతోపాటు, గిరిజనులకు ఎకో టూరిజం జీవనోపాధులు మెరుగుపర్చడం ప్రభుత్వం ముందున్న లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. నల్లమల నుంచి మారేడుమిల్లి వరకు, బాపట్ల తీర ప్రాంత అందాల నుంచి కోటప్పకొండ ఆధ్యాత్మిక ప్రయాణం వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పర్యాటక కళను తీసుకొచ్చేలా పని చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మితమైన 6 నగరవనాలను ఉప ముఖ్యమంత్రి మంగళవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "నగర వన యోజన కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 19 నగరవనాలుంటే, ఇప్పుడు ప్రారంభించిన ఆరు నగరవనాలతో కలిపి 25 నగరవనాలు రాష్ట్రంలో ఏర్పడతాయి. 305 హెక్టార్లలో, రూ. 13 కోట్లతో అభివృద్ధి చేసిన ఈ నగరవనాలు కేవలం మొక్కలు నాటే ప్రాంతాలుగా కాకుండా, ప్రజలను ప్రకృతి ఒడిలోకి తీసుకెళ్లే మార్గంగా ఉంటాయి. నగరవనాల్లో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ లు, పిల్లలు ఆడుకునే ప్రాంతాలు, జిమ్ పరికరాలు వంటివి అందుబాటులో ఉంటాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో, స్వచ్ఛమైన అందాలతో నగరవనాలు ఆరోగ్యం, ఆహ్లాదం, ప్రకృతి అవగాహన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నాం. బాపట్ల, చీరాల తీర ప్రాంత పర్యాటక వనాలుగా ఉంటే, కోటప్పకొండ ఆధ్యాత్మిక సువాసనలతో విరాజిల్లుతుంది. వినుకొండ, దేవరంపాడు, మాచర్లలో ఏర్పాటు చేసే నగరవనాలు ఆకర్షణీయంగా ఉంటాయి. ప్రకృతికి దగ్గరయితే, ఆరోగ్యం దగ్గరవుతుంది. ప్రకృతి అర్థమైతే, పరిరక్షణ బాధ్యత పెరుగుతుంది. ఇది ప్రకృతి నియమం.

**సత్సంకల్పంతో ముందడుగు వేస్తున్నాం** : రాష్ట్రంలో ఎకో టూరిజం పెరగడం వల్ల గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

మిగతా 2లో...

## స్త్రీ శక్తికి.. మహిళల నీరాజనం

- ఉద్యోగం.. విద్య.. వైద్యం.. కుటుంబ అవసరాలకు అండ
- నెలకు రూ.160 కోట్ల వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తోంది
- ఆర్టీసీ సేవలను మరింత బలోపేతం చేస్తామన్న మంత్రి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో మహిళల కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతూ

మిగతా 2లో...

## దసరా ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

- 25 లక్షల మంది భక్తుల రాకకు ఏర్పాట్లు
- 14న కనకదుర్గమ్మను దర్శించుకోనున్న రాష్ట్రపతి
- రాష్ట్రపతి, సీఎంల రాక నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



2 లో

## అగ్రిగోల్డ్ బాధితులూ.. బాండ్లు చూపించండి

- ఒరిజినల్ బాండ్ల పరిశీలనకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కేంద్రాలు
- 13 ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో పరిశీలన ప్రక్రియ
- ఒరిజినల్ బాండ్ అప్పగించొద్దు.. చూపించి కలర్ జిరాక్స్ ఇవ్వాలి
- ఆధార్, పాన్, బ్యాంక్ పాస్‌బుక్‌తో హాజరు కావాలి

2 లో

**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్)**: అగ్రిగోల్డ్ డిపాజిటర్లు, బాధితులు, ఏజెంట్ల వద్ద ఉన్న ఒరిజినల్ బాండ్లు, సంబంధిత పత్రాల పరిశీలన, నమోదు ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా చేపట్టేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అగ్రిగోల్డ్ బాధితుల సహాయ నిధి మంత్రుల బృందం వెల్లడించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల మంత్రుల బృందం నిర్ణయం

## రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టు



2 లో

- ఓటర్ల జాబితా వివాదంపై విపక్షాల ఆందోళన
- ఎన్నికల సంఘం కార్యాలయానికి పాదయాత్ర

## కూటమి ప్రభుత్వం రికార్డు...

### ఏకకాలంలో 267 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభం



- 6 నెలల్లో మరో 4,400 కొత్త భవన నిర్మాణల పూర్తి చేయడమే లక్ష్యం
- ఇందులో ఈ ఏడాది చివరి నాటికి 2,700 కేంద్రాల నూతన భవనాలు సిద్ధం
- మంత్రి సత్యకుమార్ చేతుల మీదగా జరిగిన రాష్ట్రస్థాయి ప్రారంభ కార్యక్రమం
- గ్రామానికే వైద్యం తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సత్యకుమార్ యాదవ్
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో అరుదైన ఘట్టం ఆవిష్కరణ

**గుడివాడ(జర్నలిస్ట్ ఫైల్)** : గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కృష్ణా జిల్లా గుడివాడ డివిజన్‌లోని జనార్ధనపురంలో నూతన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని మంత్రి, మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగానే రాష్ట్రంలోని 24 జిల్లాల్లో మరో 266 భవనాలను వర్చువల్‌గా ఏకకాలంలో ప్రారంభించారు. వీటి నిర్మాణానికి సుమారు రూ. 105 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. 24 జిల్లాల్లోని 87 నియోజకవర్గాల పరిధిలో ఈ భవనాలు అందుబాటులోకి వచ్చాయని మంత్రి చెప్పారు.

రాబోయే 6 నెలల్లో మిగిలిన 4,400 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందులో ఈ ఏడాది చివరి నాటికి 2,700 కేంద్రాల నూతన భవనాలను సిద్ధం చేసేలా ప్రణాళిక



మిగతా 3లో...

## స్పెయిన్ వేదికగా.. ఏపీ టూరిజానికి గ్లోబల్ బూస్ట్



- అంతర్జాతీయ పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి దుర్గేష్ పర్యటన
- టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్‌లో ఏపీ అవకాశాల ఆవిష్కరణ
- ప్రపంచ పర్యాటక దిగ్గజాలతో బీ2బీ సమావేశాలు
- నూతన పాలసీతో పెట్టుబడులకు విస్తృత అవకాశాలపై ప్రచారం

2 లో

## స్థానిక ఎన్నికలకు.. 'ఫుల్ అలర్ట్'



- ప్రశాంతంగా.. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు కార్యాచరణ
- అక్రమ మద్యం, నగదు పంపిణీపై చెక్‌పోస్టులు
- సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర గస్తీ
- స్ట్రైకింగ్ ఫోర్సును సిద్ధంగా ఉంచాలన్న డీజీపీ

2 లో

## మహిళలే.. గ్రామీణ పారిశ్రామికవేత్తలు!

- 2026-27లో 5 లక్షల మందికి పైగా మహిళలకు పారిశ్రామిక శిక్షణ
- దేశంలోనే నంబర్ 1గా ఏపీ ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ
- గత ఆర్థిక సంవత్సరంలో రూ.33,614 కోట్ల బ్యాంక్ రుణాలు
- గ్రామం నుంచి జాతీయ మార్కెట్ వరకు మహిళలకు చేయూత



3 లో

## బీసీ రిజర్వేషన్లపై తగ్గేదే లేదు

- 34 శాతం సాధించడమే ప్రభుత్వ లక్ష్యం
- సుప్రీంకోర్టులో న్యాయపోరాటానికి వ్యూహం
- సీనియర్ న్యాయవాదులతో మంత్రుల కీలక భేటీ
- బీసీలకు రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం పెంపే ధ్యేయం



3 లో

## అమరావతి పనులు.. ఇక జెట్ స్పీడ్



(మొదటి పేజీ తరువాయి)

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ తరహాలోనే నిర్మాణ రంగంలోని వారికి ఆధునిక నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ సమీక్షకు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధుల హాజరయ్యారు.

## స్త్రీ శక్తికి.. 100 కోట్ల అడుగులు

**అమరావతి, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే 'స్త్రీ శక్తి' పథకం 100 కోట్లకు పైగా ప్రయాణాలను పూర్తి చేసుకోవడం చారిత్రాత్మక మైలురాయిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పథకాన్ని రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు వినియోగించుకుంటున్నారని తెలిపారు. విద్యార్థినులు, ఉద్యోగులు, రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే మహిళలకు ఈ పథకం ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించి స్వేచ్ఛగా ప్రయాణించే భరోసాను కల్పిస్తోందన్నారు.

ఇప్పటివరకు 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలు సుమారు రూ. 3,550 కోట్లు ఆదా చేసుకున్నారని చంద్రబాబు తెలిపారు. ఈ మొత్తాన్ని పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు, భవిష్యత్ అవసరాలకు వినియోగించుకునే అవకాశం కలిగిందన్నారు. పథకాన్ని ఆదరిస్తున్న మహిళలకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, 100 కోట్ల ప్రయాణాల మైలురాయిని చేరుకోవడంలో కృషి చేసిన ఆర్టీసీ యాజమాన్యం, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## స్థానిక ఎన్నికలకు.. 'ఫుల్ అలర్ట్'




**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే అన్ని రకాల సన్నాహాలను పూర్తి చేయాలని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం గుంటూరు పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రాంతీయ సమాయత్త సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల భద్రత, శాంతిభద్రతలు, పోలీసు బందోబస్తుపై అధికారులతో సమీక్షించారు.

గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల పరిధిలోని మండలాలు, గ్రామపంచాయతీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపాలిటీల వివరాలను డీజీపీ సమీక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో వెలువడే అవకాశం ఉన్నందున ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంటే తక్కువ వ్యవధిలో ఎన్నికల ప్రక్రియను సమర్థంగా నిర్వహించవచ్చని తెలిపారు. రాజ్యాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

గత ఎన్నికల్లో ఘర్షణలు, వివాదాలు చోటుచేసుకున్న ప్రాంతాలను గుర్తించి సాధారణ, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలను వర్గీకరించాలని డీజీపీ సూచించారు. సమస్యాత్మక వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానితులపై నిఘా పెంచి ముందస్తు నివారణ చర్యలు, బైండ్‌ఓవర్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. నాటుసారా, అక్రమ మద్యం, నగదు పంపిణీ, ఇతర అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేయాలని చెప్పారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో గతంలో నమోదైన కేసుల పురోగతిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భద్రతాపరమైన లోపాలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని, రూట్ మొబైల్స్, మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసి సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర గస్తీ నిర్వహించాలని డీజీపీ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా స్ట్రైకింగ్ ఫోర్స్‌ను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. బ్యాలెట్ బాక్సుల రవాణా, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని, విధుల్లో ఉన్న సిబ్బందికి వారి బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, లైసెన్స్ కలిగిన ఆయుధాలను నిబంధనల ప్రకారం డిపాజిట్ చేయించే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. అనుమతి లేని సభలు, ర్యాలీలు, సమావేశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగించాలని, కమ్యూనికేషన్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని సూచించారు.

**సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా :** ఎన్నికల సమయంలో సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా వ్యాప్తి చెందే తప్పుడు వార్తలు, వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు, మత, వర్గ విద్వేషాలకు దారితీసే ప్రచారంపై ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులు సూచించారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా సైబర్ విభాగం నిరంతరం పర్యవేక్షించాలని, వదంతులు వెలువడిన వెంటనే వాస్తవాలను ప్రజలకు తెలియజేసి స్పష్టత ఇవ్వాలని తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజల్లో భరోసా కల్పించాలని సూచించారు.

గుంటూరు ఐజీపీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో గొడవలకు అవకాశం ఉన్న ప్రాంతాలు, వ్యక్తులను ముందుగానే గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో కార్డన్ సెర్చ్‌లు నిర్వహించి అక్రమ ఆయుధాలను గుర్తించాలని, సమస్యాత్మక వ్యక్తులను బైండ్‌ఓవర్ చేయడంతో పాటు అవసరమైన సందర్భాల్లో ఆస్తుల అటాచ్‌మెంట్‌కు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు.

గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, ఎన్నికల సన్నాహాలపై డీజీపీకి వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్ ఐజీపీ మధుసూదన్ రెడ్డి, డీఐజీ ఫకీరప్ప, బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వరరావు, పల్నాడు ఎస్పీ జగదీష్ అదహళ్లి, ప్రకాశం ఎస్పీ హర్షవర్ధన్, నెల్లూరు ఎస్పీ అజిత వేజెండ్ల, మార్కాపురం ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తికి.. మహిళల నీరాజనం

(మొదటి పేజీ తరువాయి)

100 కోట్ల ఉచిత ప్రయాణాల మైలురాయిని అధిగమించడం పట్ల రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు హర్షం వ్యక్తం చేశారు.

మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ప్రారంభించిన స్త్రీ శక్తి పథకానికి మహిళల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తోందని మంత్రి తెలిపారు. గతేడాది ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదుకావడం పథకం విజయానికి నిదర్శనమన్నారు.

ప్రతిరోజూ సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారని, ఇప్పటివరకు మహిళలకు సుమారు రూ. 3,550 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం కలిగిందని మంత్రి పేర్కొన్నారు. మహిళలపై కుటుంబ ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గిస్తూ, వారి అవసరాలకు ఆర్థిక స్వేచ్ఛను కల్పించడంలో ఈ పథకం కీలకంగా మారిందన్నారు.




ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం హామీలుగా కాకుండా బాధ్యతగా భావించి అమలు చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని మంత్రి స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా కొంత భారాన్ని భరిస్తున్నప్పటికీ, మహిళల సంక్షేమం విషయంలో వెనుకడుగు వేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఈ పథకాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తున్నారని తెలిపారు.

ఆర్టీసీపై నెలకు సుమారు రూ. 160 కోట్ల మేర భారం పడుతున్నప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వం రూ. 2,160 కోట్లను ఆర్టీసీకి చెల్లించడం ద్వారా పథకం అమలుకు పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ప్రభుత్వానికి భారంగా భావించకుండా, మహిళల సంక్షేమం కోసం బాధ్యతగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

**ప్రభుత్వ పథకాలన్నింటిలోనూ విశేష ఆదరణ :** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో స్త్రీ శక్తి పథకం మహిళల నుంచి అత్యధిక ఆదరణ పొందుతున్న పథకాలలో ఒకటిగా నిలిచిందని మంత్రి మండిపల్లి అన్నారు. మహిళలు తమ కుటుంబ అవసరాల కోసం, ఉద్యోగాలు, విద్య, వైద్యం, ఇతర పనుల నిమిత్తం ప్రయాణించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు.

మహిళల ప్రయాణ ఖర్చు తగ్గడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితికి కూడా ఈ పథకం అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి మహిళా సంక్షేమం, సాధికారతకు స్త్రీ శక్తి పథకం ఒక మంచి ఉదాహరణ అని మంత్రి పేర్కొన్నారు.

**ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు :** స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బందికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

రోజుకు లక్షలాది మంది మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు ఆర్టీసీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

భవిష్యత్తులో కూడా మహిళలకు మరింత మెరుగైన సేవలు అందించేలా ఆర్టీసీని బలోపేతం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. స్త్రీ శక్తి పథకం మరింత సమర్థవంతంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని, మహిళలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు.

స్త్రీ శక్తి పథకాన్ని ఆదరిస్తూ 100 కోట్ల ఉచిత ప్రయాణాల మైలురాయిని చేరేలా చేసిన రాష్ట్రంలోని ప్రతి మహిళకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు కృతజ్ఞతలు తెలిపారు. మహిళల ఆశీస్సులతో ఈ పథకం మరింత విజయవంతంగా కొనసాగుతుందని ఆయన ఆకాంక్షించారు.

# ప్రకృతి ఒడిలో.. ప్రజలకు మధురానుభూతి

(మొదటి పేజీ తరువాయి)

వెలిగోడు జంగిల్ సఫారీతో సరికొత్త అనుభూతులు లభిస్తాయి. మారేడుమిల్లి ట్రెక్కింగ్, ఆరోమా కనోపీ వాక్ ద్వారా తూర్పు కనుమల అటవీ అందాలను, ప్రకృతి పరిమళలను ప్రజలకు చేరువ చేస్తాం. గిరిజన సంస్కృతిని ప్రజలకు తెలియజేసేందుకు ప్రయత్నిస్తాం. దీనివల్ల గిరిజనుల జీవన విధానంలో మంచి మార్పులు వస్తాయని సత్సంకల్పంతో పని చేస్తున్నాం. ప్రకృతిని ప్రేమించాలి.. భావితరాలకు బహుమతిగా ఇవ్వాలనేది మా సంకల్పం. దీనికి కట్టుబడి పనిచేస్తాం. దీనికి ప్రజలు తమవంతుగా సహకరించాలి" అన్నారు.



అనంతరం ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ రూపొందించిన వైల్డ్ ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఆఫ్ ద నల్లమల ఫారెస్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ట్రీ టాన్స్ లోకేషన్ మాన్యువల్ పుస్తకాలను ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ దేశంతోనే మొదటిసారి "ఈకోలిప్టస్ పల్ప్ ఉడ్ ప్లాంటేషన" విభాగంలో అనుసరిస్తున్న సుస్థిర నిర్వహణ పద్ధతులకు గుర్తింపుగా సాధించిన ప్రమాణ్ సర్టిఫికేట్ ను డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అటవీశాఖ అధికారులు అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ కొణిదల నాగేంద్రబాబు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, అటవీ, పర్యావరణ శాఖ చీఫ్ సెక్రటరీ కాంతిలాల్ దండే, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ డాక్టర్ చలపతిరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, సీఈవో ఏపీ గ్రీన్ బీఎనఎన్ మూర్తి, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఎకో టూరిజం ఈడీ నందిని సలారియా, అటవీశాఖ ఐటీ సలహాదారుల పి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

**విజయవాడ, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 14న సాయంత్రం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకోనున్నట్లు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. 14, 15 తేదీల్లో రాష్ట్రపతి విజయవాడలో ఉండనున్నట్లు చెప్పారు. మంగళవారం విజయవాడలో దసరా ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 16న మూల నక్షత్రం సందర్భంగా సీఎం చంద్రబాబు కుటుంబసమేతంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాలకు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నందున వారికి అమ్మవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.



కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మూడోసారి దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈసారి సుమారు 25 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని, రోజుకు 2.5 లక్షల మందికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కొండచరియలను తొలగించి తాత్కాలికంగా భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తున్న ప్రాంతాలను సిద్ధం చేస్తున్నామని, రైల్వే స్థలాన్ని హోల్డింగ్ ఏరియాగా వినియోగించనున్నట్లు వివరించారు.

హోల్డింగ్ ఏరియా నుంచి సుమారు 2.5 కిలోమీటర్ల మేర క్యూ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు పాలు, తాగునీరు, బిస్కెట్లు అందించడంతో పాటు హోల్డింగ్ ఏరియాలో ప్రసాదం పంపిణీ చేస్తామని చెప్పారు. అన్ని మార్గాలను అనుసంధానిస్తూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామని తెలిపారు. ఈ నెల 23 తర్వాత భవానీ మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

సామాన్య భక్తుల నుంచి వీవీఐపీల వరకు అందరికీ దర్శనం కల్పించేలా చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రపతి, ముఖ్యమంత్రులు వంటి వీవీఐపీలు వచ్చిన సమయంలో మాత్రమే కొంతసేపు సామాన్య భక్తుల దర్శనాన్ని నిలిపివేస్తామని తెలిపారు. అంతరాలయ దర్శనంలో భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఉదయం, సాయంత్రం కలిపి 2 గంటల 45 నిమిషాల పాటు వీఐపీ దర్శనాలకు సమయం కేటాయిస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వివరించారు.

# అగ్రిగోల్డ్ బాధితులూ.. బాండ్లు చూపించండి

**(మొదటి పేజీ తరువాయి)**మేరకు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపింది. బాధితులు, చట్టబద్ధ వారసులు, ఏజెంట్లు నిర్దేశిత కేంద్రాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించింది.

డిపాజిటర్ జీవించి ఉంటే ఒరిజినల్ బాండ్ లేదా నగదు రశీదును పరిశీలన కోసం తప్పనిసరిగా చూపించి, సంతకం చేసిన బాండ్ కలర్ జిరాక్స్ సమర్పించాలి. ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ, తాజా ఫొటో, మొబైల్ నంబర్లు, ఏజెంట్ వివరాలు అందించాలి. బ్యాంక్ పాస్‌బుక్‌లో ఖాతాదారు పేరు, ఖాతా సంఖ్య, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ స్పష్టంగా ఉండాలని అధికారులు తెలిపారు.

డిపాజిటర్ మరణించి, నామినీ జీవించి ఉంటే ఒరిజినల్ బాండ్‌తో పాటు బాండ్ కలర్ జిరాక్స్, మరణ ధ్రువీకరణ పత్రం, నామినీ ఆధార్, పాన్, రేషన్ కార్డు లేదా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్, ఫొటో, మొబైల్ నంబర్ సమర్పించాలి. డిపాజిటర్, నామినీ ఇద్దరూ మరణించిన సందర్భంలో చట్టబద్ధ వారసుడు లేదా కుటుంబ సభ్యుడు బాండ్ కలర్ జిరాక్స్‌తో పాటు ఇద్దరి మరణ ధ్రువీకరణ పత్రాలు, తన ఆధార్, పాన్, రేషన్ కార్డు లేదా లీగల్ హెయిర్ సర్టిఫికెట్, బ్యాంక్ పాస్‌బుక్, ఫొటో, మొబైల్ నంబర్ అందించాలి.

డిపాజిటర్ స్వయంగా పరిశీలన కేంద్రానికి రాలేని పరిస్థితిలో కుటుంబ సభ్యుడు హాజరై అవసరమైన పత్రాలు సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. ఇందుకు డిపాజిటర్ బాండ్, ఆధార్, పాన్, బ్యాంక్ పాస్‌బుక్, ఫొటోలతో పాటు హాజరయ్యే కుటుంబ సభ్యుడి గుర్తింపు పత్రం, కుటుంబ సంబంధాన్ని నిర్ధారించే పత్రం, డిపాజిటర్ ఇచ్చిన అధికారిక లేఖను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఏజెంట్లు బాండ్లను సమర్పించే సమయంలో ప్రతి ఒరిజినల్ బాండ్‌ను పరిశీలన కోసం చూపించి, కలర్ జిరాక్స్ ఇవ్వాలి. ప్రతి బాండ్ ఐడెంటిఫికేషన్ నంబర్‌ను నమోదు చేయడంతో పాటు ఏజెంట్ ఆధార్, పాన్, బ్యాంక్ పాస్‌బుక్, ఫొటో, మొబైల్ నంబర్, ఏజెంట్ కోడ్ వివరాలను అందించాలి. సమర్పించిన బాండ్ల సంఖ్యను ప్రత్యేకంగా సరిపోల్చి రికార్డుల్లో నమోదు చేస్తామని అధికారులు తెలిపారు.

**ఒరిజినల్ బాండ్లు ఇవ్వొద్దు :** ఒరిజినల్ బాండ్లను కేవలం పరిశీలన కోసం మాత్రమే చూపించాలని, వాటిని అధికారులకు అప్పగించాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. బాండ్ నంబర్ సహా అన్ని వివరాలు స్పష్టంగా కనిపించే కలర్ జిరాక్స్‌పై సంబంధిత డిపాజిటర్, నామినీ లేదా చట్టబద్ధ వారసుడు సంతకం చేసి సమర్పించాలి. సమర్పించిన పత్రాలకు ధ్రువీకరణ రశీదు ఇస్తామని తెలిపారు. ఏజెంట్ వివరాలు తెలియకపోతే 'తెలియదు / అందుబాటులో లేదు' అని పేర్కొనవచ్చని సూచించారు.

**13 ఉమ్మడి జిల్లాల్లో ప్రత్యేక కేంద్రాలు :** రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లోని జిల్లా పోలీస్ కార్యాలయాల్లో ప్రత్యేక అగ్రిగోల్డ్ బాండ్ పరిశీలన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశీలన ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లాల వారీగా కేంద్రాల పేరు, పూర్తి చిరునామా, కేటాయించిన తేదీలను సంబంధిత జిల్లా అధికారులు త్వరలో ప్రకటిస్తారని అధికారులు తెలిపారు.

**గుంటూరు జిల్లాకు ప్రత్యేక అధికారులు :** గుంటూరు జిల్లాలో అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలన ప్రక్రియకు సీఐడీ గుంటూరు ఆర్‌ఓ డీఎస్పీ ఎస్.కె. అబ్దుల్ బషీర్, సీఐడీ గుంటూరు ఆర్‌ఓ ఐఓపీ టి. సంజీవి కుమార్ ఇన్‌చార్జ్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. అగ్రిగోల్డ్ డిపాజిటర్లు, బాధితులు, ఏజెంట్లు తమ వద్ద ఉన్న ఒరిజినల్ పత్రాలను పరిశీలన కోసం తీసుకువచ్చి, అవసరమైన కలర్ జిరాక్స్, ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## స్పెయిన్ వేదికగా.. ఏపీ టూరిజానికి గ్లోబల్ బూస్ట్



**అమరావతి, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగానికి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పెయిన్‌లో పర్యటిస్తున్నారు. అక్టోబర్ 6 నుంచి 8 వరకు జరిగే పర్యటనలో భాగంగా సెవిల్లెలోని ఫిబెస్ వేదికగా నిర్వహిస్తున్న టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్–2026లో మంత్రి పాల్గొననున్నారు. పర్యాటక రంగంలో నూతన ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతికత, సుస్థిర అభివృద్ధిపై జరిగే చర్చల్లో పాల్గొంటూ ఏపీకి ఉన్న పర్యాటక, పెట్టుబడి అవకాశాలను అంతర్జాతీయ వేదికపై వివరించనున్నారు.

సమ్మిట్ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా తరలివచ్చే పర్యాటక నిపుణులు, ప్రభుత్వ ప్రతినిధులు, డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ సంస్థలు, ఆతిథ్య రంగ ప్రముఖులతో మంత్రి సమావేశం కానున్నారు. ఏపీ పర్యాటక వనరులు, నూతన పర్యాటక పాలసీ 2024--29లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి ఆహ్వానించనున్నారు. డిజిటల్ ఇన్నోవేషన్, స్మార్ట్ డెస్టినేషన్స్, సుస్థిర పర్యాటకం, పర్యాటక పెట్టుబడులు--ఫైనాన్స్, డెస్టినేషన్ మార్కెటింగ్, సందర్శకుల అనుభవం, ఏవియేషన్, మొబిలిటీ, కనెక్టివిటీ అంశాలపై జరిగే ప్యానెల్ చర్చలు, కీనోట్ సెషన్లు, బీ2బీ సమావేశాల్లో ఏపీ అవకాశాలను ప్రదర్శించనున్నారు.

రాష్ట్ర పర్యాటక రంగానికి సంబంధించి అధికారిక ప్రెజెంటేషన్ ద్వారా ఏపీలోని ప్రముఖ పర్యాటక గమ్యస్థానాలు, మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. గత రెండేళ్లలో పర్యాటక రంగంలో రూ. 20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పారిశ్రామిక హోదా సాధించిన రాష్ట్రం, నూతన పర్యాటక పాలసీ 2024–29 ద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు చేపడుతోందని మంత్రి వివరించనున్నారు.

## రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** ఓటర్ల జాబితా సవరణ, ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన (ఎస్.ఐ.ఆర్) అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. 'సేవ్ డెమోక్రసీ' నినాదంతో పార్లమెంట్ నుంచి నిర్వచన్ సదన్ వరకు భారీ పాదయాత్ర నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లు తొలగించారని ఆరోపించిన విపక్ష నేతలు, ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్‌తో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపీలు ర్యాలీలో పాల్గొన్నారు. బ్యానర్లు, ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ ముందుకు సాగిన నేతలను పోలీసులు నీతి ఆయోగ్ కార్యాలయం సమీపంలో అడ్డుకున్నారు. దీంతో విపక్ష ఎంపీలు రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. రాహుల్ గాంధీ సహా పలువురు నేతలు బ్యారికేడ్లు దాటి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బస్సుల్లో తరలించారు.

ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో దాదాపు 13 కోట్ల ఓట్లు తొలగించారని, ఇది దేశ రాజకీయ చరిత్రలోనే అతిపెద్ద మోసమని ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభావితం చేస్తోందని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్.ఐ.ఆర్‌ను తక్షణమే నిలిపివేసి, తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాల్లో చేర్చాలని కోరారు.

ఫామ్–6లో మార్పులు, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై ఎన్నికల సంఘం వివరణలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని సీపీఐ ఎంపీ సంతోష్‌కుమార్ ఆరోపించారు. ఎస్.ఐ.ఆర్‌పై విపక్ష ఎంపీలు తీవ్ర స్థాయిలో నినాదాలు చేశారు. ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఇతర ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండానే జరిగాయని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయని విపక్ష నేతలు ప్రస్తావించారు.

విపక్షాల ర్యాలీ నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పార్లమెంట్ నుంచి నిర్వచన్ సదన్‌కు వెళ్లే మార్గాల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఎన్నికల సంఘం కార్యాలయం, కీలక ప్రాంతాల్లో పారామిలటరీ, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాలను మోహరించారు. భద్రతా కారణాలతో కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్, మొబైల్ డేటా సేవలపై కూడా ఆంక్షలు విధించినట్లు అధికారులు తెలిపారు.

## మహిళలే.. గ్రామీణ పారిశ్రామికవేత్తలు!



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళా స్వయం సహాయక సంఘాలను కేవలం రుణాలు పొందే సంఘాలుగా కాకుండా.. ఉత్పత్తి, వ్యాపారం, మార్కెటింగ్ రంగాల్లో రాణించే గ్రామీణ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని ఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ అత్యుత్తమ స్థాయిలో ఉండటం గర్వకారణమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి కుటుంబంలో ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మందికి పైగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ అత్యుత్తమ స్థాయిలో ఉండటం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.33,614 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించి దేశంలోనే రికార్డు సృష్టించామని, తద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ రుణాలపై ఇప్పటివరకు బ్యాంకులు వసూలు చేస్తున్న ప్రాసెసింగ్ చార్జీలు, ఇన్‌స్పెక్షన్ చార్జీలు, లెడ్జర్ ఫోలియో చార్జీలను ఎత్తివేస్తున్నామని మంత్రి ప్రకటించారు. దీనివల్ల ఒక్కో ఎస్‌హెచ్‌జీ సంఘానికి సంవత్సరానికి సుమారు రూ.32,500 వరకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఎస్‌హెచ్‌జీ రుణాల రీపేమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తోందని మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో ఎన్‌పీఏ సగటు 1.78 శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అది కేవలం 0.67 శాతంగా ఉందని పేర్కొన్నారు. ఇది రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనమన్నారు.

అలాగే రూ.23 కోట్లకు పైగా స్త్రీనిధి ప్రోత్సాహకాలను విడుదల చేశామని మంత్రి తెలిపారు.

**వీవోఏల పనిభారం తగ్గించేందుకు 'ఈ-నారీ' :** క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల (వీవోఏ) పనిభారాన్ని తగ్గించడంతో పాటు వారి కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు 'ఈ-నారీ' వ్యవస్థను ప్రవేశపెట్టామని మంత్రి తెలిపారు. సాంకేతికతను వినియోగించడం ద్వారా మహిళా సంఘాల కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం పెరుగుతుందని తెలిపారు.

**విజయవాడలో జాతీయ సరస్ ఆజీవికా మేళా :** ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిని దాటి దేశంలోనే తొలిసారిగా విజయవాడ పున్నమి ఘాట్‌లో జాతీయ సరస్ ఆజీవికా మేళా నిర్వహించనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో మార్కెట్ చేసుకునేందుకు ఈ మేళా ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని చెప్పారు. ఈ మేళాలో సుమారు 600 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో ఇతర రాష్ట్రాల మహిళా పారిశ్రామికవేత్తల కోసం 250 స్టాళ్లు, ఆంధ్రప్రదేశ్ ఎస్ఆర్ఎల్ఎం మహిళా పారిశ్రామికవేత్తల కోసం 350 స్టాళ్లు కేటాయిస్తున్నామని వివరించారు.

**గ్రామం నుంచి జాతీయ మార్కెట్ వరకు :** "ఎస్‌హెచ్‌జీ మహిళ నుంచి గ్రామీణ పారిశ్రామికవేత్తగా - గ్రామం నుంచి జాతీయ మార్కెట్ వరకు" అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, వారి ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, బ్యాంకింగ్ సదుపాయాలను విస్తరించడం ద్వారా మహిళా సాధికారత దిశగా ఆంధ్రప్రదేశ్ వేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంతో గత ప్రభుత్వ విధ్వంసం నుంచి వికాసం వైపు, నిరాశ నుంచి నమ్మకం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మహిళలకు ఆర్థికంగా మరింత బలమైన భవిష్యత్తును అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## బీసీ రిజర్వేషన్లపై తగ్గేదే లేదు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం న్యాయపోరాటం కొనసాగిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి, అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రులు సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు.

**సుప్రీంకోర్టు ద్వారా న్యాయం సాధించేందుకు పోరాటం: రామ్మోహన్ నాయుడు**

బీసీ రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని అధిగమించేందుకు తగిన ఎంపైరికల్ డేటాతో సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్ర హైకోర్టు తీర్పులను పూర్తిగా అధ్యయనం చేసి, వాటి ఆధారంగా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 34 శాతం రిజర్వేషన్లు అమలైతే సుమారు 16,800 పోస్టులు బీసీలకు దక్కుతాయని, పంచాయతీ సర్పంచ్‌ల నుంచి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, మేయర్‌ల వరకు ప్రాతినిధ్యం పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

**34 శాతం రిజర్వేషన్ల కోసం చివరి వరకు పోరాటం: అచ్చెన్నాయుడు :** బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఉత్తర్వులు, తదుపరి న్యాయపోరాట వ్యూహాలపై చర్చించేందుకు మంత్రుల బృందం ఢిల్లీకి వచ్చినట్లు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, దేవదత్ కామత్‌తో సమావేశమై న్యాయ నిపుణుల సలహాలు, సుప్రీంకోర్టు తీర్పులు, వివిధ కమిషన్ల నివేదికల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు చెప్పారు.

**సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం: పార్థసారధి**

రాష్ట్రంలో బలహీన వర్గాలకు సామాజిక న్యాయంతో పాటు రాజకీయ, ప్రజాస్వామ్య సాధికారత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. 34 శాతం రిజర్వేషన్లు సాధించాలనే పట్టుదలతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. గతంలో ఎన్డీయే ప్రభుత్వ హయాంలో 34 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. రాజ్యాంగంలోని 243డి, 243టి అధికరణల ప్రకారం బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

**రాష్ట్ర అభివృద్ధే సీఎం లక్ష్యం: అనగాని సత్యప్రసాద్**

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ రాష్ట్ర అభివృద్ధినే కోరుకుంటారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాజకీయంగా ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ఇప్పటివరకు పలుమార్లు ఢిల్లీకి వచ్చారని, సీఎం ఢిల్లీ పర్యటన నేపథ్యంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.

ఈ విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం రికార్డు... ఏకకాలంలో 267 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించామని చెప్పారు. తదుపరి ప్రారంభ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవన నిర్మాణ పనులు పంచాయతీరాజ్ శాఖ ద్వారా కొనసాగుతున్నాయని చెప్పారు. గ్రామం నుంచి పట్టణానికి వెళ్లి వైద్యం పొందాల్సిన అవసరం లేకుండా వైద్య సేవలనే గ్రామానికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ లో ఒకేసారి 267 నూతన ఆరోగ్య భవనాలను ప్రారంభించడం అరుదైన ఘట్టంగా నిలిచింది.



**నిలిచిన పనులు.. పెరిగిన భారం :** గత ప్రభుత్వ నిర్వాకంతో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలతోపాటు కొత్తగా చేపట్టిన నిర్మాణాలు కలిపి మొత్తం 4,400కు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను పూర్తి చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇందుకోసం వివిధ పథకాల కింద రూ.1,128.02 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో వ్యయం కూడా పెరిగిందని తెలిపారు. గతంలో ఒక్కో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి సుమారు రూ.17.50 లక్షలు ఖర్చు కాగా, ప్రస్తుతం జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఒక్కో కేంద్రానికి సుమారు రూ.36 లక్షల వరకు కేటాయిస్తున్నామని వివరించారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక వసతుల పథకం కింద మరో సుమారు 700 కేంద్రాలను ఒక్కో కేంద్రానికి రూ.55 లక్షల చొప్పున అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

**ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలతో గ్రామానికే వైద్యం :** ప్రతి 5 వేల జనాభాకు ఒకటి చొప్పున ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి కేంద్రంలో 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు, 71 రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. బీపీ, మధుమేహం, మాతా శిశు ఆరోగ్యం, కంటి, నోటి ఆరోగ్యం, వృద్ధుల ఆరోగ్యం, అంటువ్యాధులను ముందుగానే గుర్తించేలా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అవసరమైన వారికి ఉన్నత వైద్య సేవలకు పంపించడంతోపాటు, దూర వైద్య సేవల ద్వారా నిపుణుల సలహాలు అందించే విధానాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

**'సంజీవని'తో ఆరోగ్య సమాచారం ఒకేచోట :** ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలను డిజిటల్‌గా నమోదు చేసి, భవిష్యత్తులో అవసరమైనప్పుడు సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి 'సంజీవని' విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి వ్యక్తికి ప్రత్యేక ఆరోగ్య గుర్తింపు సంఖ్యను కేటాయించి, వైద్య పరీక్షలు, మందులు, వైద్యుల సలహాలు, ఆసుపత్రుల్లో పొందిన చికిత్స వివరాలను భద్రపరిచే విధానం తీసుకొస్తున్నామని చెప్పారు.

దాదాపు 2,500 మంది సమన్వయకర్తల ద్వారా సేవలను ప్రజలకు చేరువ చేస్తామని, దూర వైద్యం, వైద్యుల సలహాలు, ఆసుపత్రి అపాయింట్‌మెంట్ వంటి సేవలను కూడా అనుసంధానం చేస్తామని తెలిపారు. జనవరి 1 నుంచి ఈ సేవలను ప్రారంభించే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

**930 మొబైల్ ఆరోగ్య కేంద్రాలు :** మారుమూల గ్రామాలకు వైద్య సేవలను తీసుకెళ్లేందుకు 930 మొబైల్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఒక్కో వాహనంలో 41 రకాల పరీక్షలు నిర్వహించే సదుపాయంతోపాటు, సుమారు రూ.10 లక్షల విలువైన ఆటో అనలైజర్ పరికరం ఉంటుందని చెప్పారు.

ఈ వాహనాలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి గ్రామాలను సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు. సాధారణంగా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చయ్యే కొన్ని పరీక్షలను ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**వ్యాధి వచ్చిన తర్వాత కాదు.. ముందే గుర్తింపు :** వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే ముందుగానే గుర్తించి నివారించడానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను తొలిదశలో గుర్తించి చికిత్స అందిస్తే భవిష్యత్తులో మూత్రపిండాలు, గుండె వంటి తీవ్రమైన సమస్యలను నివారించవచ్చని తెలిపారు.

**నాణ్యతా ప్రమాణాల్లో పురోగతి :** విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సేవల నాణ్యతను పెంచేందుకు జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాల గుర్తింపు కోసం చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. 2024-25లో 752, 2025-26లో 892 కేంద్రాలు గుర్తింపు పొందాయని చెప్పారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,644 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు ఈ గుర్తింపు లభించిందని వివరించారు.

**వైద్య సిబ్బందికి ప్రజల సహకారం అవసరం :** గ్రామస్థాయిలో ఆరోగ్య సేవలు అందించడంలో మధ్యస్థాయి ఆరోగ్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజలు వారి సేవలను గౌరవించాలని, ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామీణ ఆరోగ్య సేవలు మరింత బలోపేతం అవుతాయని చెప్పారు.

**గుడివాడ నియోజకవర్గంలో 41 కేంద్రాలు :** గుడివాడ నియోజకవర్గంలో 41 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, మూడు బ్లాక్ ప్రజారోగ్య యూనిట్లు, ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వీటి ద్వారా నియోజకవర్గంలోని గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు మరింత చేరువ అవుతాయని చెప్పారు. గ్రామానికే వైద్యం తీసుకెళ్లి, ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆర్థిక రంగం అనుకూలంగా లేనప్పటికీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా స్త్రీ శక్తి బట్టి పథకాలను అమలు చేస్తున్నారని ప్రశంసించారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో ఓపి సేవలు పెరిగాయని చెప్పారు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీర పాండ్యన్, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణ ప్రసాద్,వర్ల కుమార్ రాజా,యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమ్మెలపై ప్రభుత్వం స్పందించాలి

- **వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల సమస్యలపై సంయుక్త సమావేశం నిర్వహించాలి**
- **ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్ రావు డిమాండ్**



**అమరావతి, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** వైద్య ఆరోగ్య శాఖలో వివిధ కేడర్ల ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపడుతున్న సమ్మెలు, ఆందోళనలపై ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ గుర్తింపు, సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం కలిగిన తమ సంఘం తరపున ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సంఘాలుగా ఏర్పడి, రిజిస్టర్డ్ సంఘాల ద్వారా హక్కుల కోసం పోరాడుతున్నారని, కొన్ని సందర్భాల్లో జేఏసీలుగా ఏర్పడి నిరసనలు, సమ్మెలకు దిగుతున్నారని చెప్పారు.

ఉద్యోగ సంఘాలు లేవనెత్తుతున్న డిమాండ్లు సహేతుకమైనవా కాదా అనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం, వారితో చర్చలు, సంప్రదింపులు జరపకపోవడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని ఆస్కార్ రావు అన్నారు. ఉద్యోగుల సమస్యలపై సెప్టెంబర్ 17, 2026న జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శి వీర పాండ్యన్‌తో చర్చించినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం నిరంతర ప్రక్రియను కొనసాగించాలని కోరారు.

**డిప్యుటేషన్‌తో సమస్య పరిష్కారం కాదు :** ఒక వర్గం ఉద్యోగులు సమ్మెలో ఉన్నప్పుడు మరో వర్గం ఉద్యోగులను వారి స్థానాల్లో డిప్యుటేషన్‌పై పనిచేయిస్తూ అదనపు పనిభారం మోపడం సరైన విధానం కాదని ఆస్కార్ రావు అన్నారు. రేపు అదనపు పనిభారాన్ని భరించలేక ఇతర ఉద్యోగులు కూడా సమ్మెకు దిగితే ప్రజారోగ్య వ్యవస్థను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. వైద్య ఆరోగ్య శాఖ అత్యవసర శాఖగా నిరంతరం ప్రజారోగ్య సేవలు అందిస్తుండటంతో ఉద్యోగుల మధ్య నెలకొన్న అసంతృప్తి, ఆందోళనలు ప్రజలకు అందే సేవలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. సమస్యలను పరిష్కరించకుండా ఒక వర్గం స్థానంలో మరో వర్గాన్ని పనిచేయించడం వల్ల దీర్ఘకాలిక పరిష్కారం లభించదని పేర్కొన్నారు.

**సమ్మెలపై స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం :** వైద్య ఆరోగ్య శాఖలో సమ్మెలను నిషేధిస్తూ ప్రభుత్వం కొంతకాలం క్రితం జీఓ జారీ చేసినప్పటికీ, ఇంత పెద్దఎత్తున ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని ఆస్కార్ రావు అన్నారు. సమ్మె చట్టబద్ధమైనదా, ఎవరు సమ్మె చేయవచ్చు, సమ్మె నోటీసు ఎవరు ఇవ్వాలి, చట్టబద్ధమైన సమ్మెకు సంబంధించిన నిబంధనలు ఏమిటి అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే వివిధ కేడర్ల ఉద్యోగుల్లో అసంతృప్తి పెరిగి ఉద్యమాలకు సిద్ధమవుతున్న పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయపడ్డారు.

**గుర్తింపు సంఘంతో సంయుక్త సమావేశం నిర్వహించాలి :** వైద్య ఆరోగ్య శాఖలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వమే నిర్వహించిన ఉద్యోగ సంఘాల ఎన్నికల్లో ఆరు సంఘాలు పోటీ చేశాయని, అందులో తమ సంఘం మెజారిటీ ఓట్లు సాధించి గుర్తింపు సంఘంగా కొనసాగుతోందని ఆస్కార్ రావు తెలిపారు. గుర్తింపు సంఘంతో అధికారులు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం నిర్వహించి ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లపై చర్చించాలని కోరారు. గతంలో ఇటువంటి సంయుక్త సమావేశాల ప్రక్రియ క్రమం తప్పకుండా కొనసాగేదని, ప్రస్తుతం ప్రభుత్వ అలసత్వం కారణంగా ఆ ప్రక్రియ సజావుగా సాగడం లేదని అన్నారు. ఉద్యోగ సంఘాలతో నిరంతరం చర్చలు జరిపితే అనేక సమస్యలను సమ్మెలు, ఆందోళనలకు దారితీయకుండా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు.

**ప్రధాన సమస్యలు ఇవే :** ప్రస్తుతం వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆస్కార్ రావు వివరించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం, సిబ్బందిపై పెరుగుతున్న అదనపు పనిభారం, ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిన యాప్‌ల భారం, రెండో ఏఎన్ఎంలకు జీతాల పెంపు, ఇప్పటికే ఏర్పడిన ఖాళీలను నియామక ప్రక్రియ ద్వారా భర్తీ చేయడం వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయని తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించడం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం ద్వారా ఉద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తిని తగ్గించవచ్చని అన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిపై అదనపు పనిభారం పెరుగుతోందని, దీనికి తోడు వివిధ యాప్‌లలో సమాచారాన్ని నమోదు చేయాల్సిన బాధ్యతలు పెరగడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రెండో ఏఎన్ఎంల వేతనాల పెంపు అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.

**ప్రభుత్వం చొరవ చూపాలి :** తమ సంఘంతో ప్రభుత్వ నిబంధనలు, కార్మిక చట్టాలను అనుసరించి ప్రభుత్వం వెంటనే సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని ఆస్కార్ రావు తెలిపారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలన్నింటినీ ఆ సమావేశంలో చర్చించి, ఒక్కొక్క అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి పరిష్కారం కనుగొంటే సమ్మెలు, ఆందోళనల అవసరం ఉండదని పేర్కొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా గుర్తింపు సంఘంతో చర్చలు ప్రారంభించాలని, ప్రజారోగ్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆస్కార్ రావు కోరారు. ఉద్యోగులు, అధికారులు, ప్రభుత్వం పరస్పర చర్చలతో ముందుకు సాగితేనే శాఖలో సుస్థిరమైన వాతావరణం ఏర్పడి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించగలమని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు టీడీకే సాగర్, జిల్లా నాయకులు కొండపల్లి శ్రీనివాస రావు, పి. అపరంజమ్మ, వి.వి. సత్యనారాయణ బాబు, ఆంగిరేకుల దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 2,691 మంది రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు

- **చావలి గ్రామంలో పంపిణీ చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు**

**వేమూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** వేమూరు మండలం చావలి గ్రామంలోని స్వర్ణ సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చావలి, అబ్బనగుడవల్లి, చదలవాడ గ్రామాలకు చెందిన 2,691 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు. చావలి గ్రామంలో 1,414, అబ్బనగుడవల్లిలో 354, చదలవాడలో 923 పాస్‌పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రీ-సర్వే ద్వారా రైతుల భూ హక్కులను స్పష్టంగా, పారదర్శకంగా నమోదు చేసి అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలు భూమిపై హక్కుకు అధికారిక ధ్రువీకరణగా ఉపయోగపడటంతో పాటు ప్రభుత్వ పథకాలు, రుణ సదుపాయాలు పొందేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయితే భూ వివరాల్లో స్పష్టత రావడంతో భూ వివాదాలు తగ్గి రైతులకు మరింత భద్రత కలుగుతుందన్నారు.

వేమూరు మండలంలో ఇప్పటికే పులిచింతలపాలెం, పోతుమర్రు, వరాహపురం, బలిజేపల్లి, కుచేల్లపాడు గ్రామాల్లో మొత్తం 1,933 పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. తాజాగా మరో 2,691 పాస్‌పుస్తకాలు అందజేయడంతో మండలంలో ఇప్పటివరకు 4,624 పాస్‌పుస్తకాల పంపిణీ పూర్తయింది. మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రియ దశలవారీగా కొనసాగుతోందని, మిగిలిన గ్రామాల్లోనూ పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి అర్హులైన రైతులకు పాస్‌పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పీఆర్సీ నివేదిక గడువు ఆరు నెలలకు కుదించాలి

**అమరావతి, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** 12వ పీఆర్సీ నివేదిక సమర్పణ గడువును ఆరు నెలలకు కుదించి త్వరితగతిన అమలు చేయాలని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్ ప్రభుత్వాన్ని కోరారు. గడువు తగ్గించకపోతే 2028లో అమలు కావాల్సిన 13వ పీఆర్సీని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.

12వ పీఆర్సీ 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సి ఉండగా ఇప్పటికే 40 నెలలు ఆలస్యమైందని షరీఫ్ పేర్కొన్నారు. నివేదిక సమర్పణకు ఏడాది గడువు ఇవ్వడంతో పాటు దానిపై పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ, ఉత్తర్వుల జారీకి మరింత సమయం పడితే 2028 నాటికి ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నందున పీఆర్సీ నివేదికను ఆరు నెలల్లో సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే 2023 జూలై 1 నుంచి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులందరికీ గ్రాట్యుటీ పెంపును వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

## సేవా దృక్పథంతోనే రాజకీయాల్లోకి లేళ్ళ అప్పిరెడ్డి

- **వైసీపీ స్టేట్ లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోలూరి**

**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖంగా వినిపించే అతి కొద్ది మంది ప్రజా నాయకులలో లేళ్ళ అప్పిరెడ్డి అగ్రగణ్యుడని వైసీపీ రాష్ట్ర లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ (జోన్-3) పోలూరి వెంకటరెడ్డి కొనియాడారు. రాజకీయ రంగంలోనే కాక సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా ఆయన ఎప్పుడూ అందరి కన్నా ఒకడుగు ముందే ఉంటారని తెలిపారు. శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర లీగల్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం అరండల్‌పేటలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన బర్త్ డే కేక్‌ను న్యాయవాదులతో కలిసి ఆయన కట్ చేశారు. అనంతరం ప్రమాదవశాత్తు గాయపడి మంచానికే పరిమితమైన పచ్చల అనిల్ అనే న్యాయవాది పిల్లల చదువుకు అవసరమైన 86వేల రూపాయల నగదును వారికి అందజేశారు.

ఈ సందర్భంగా పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర రాజకీయాల్లో స్వయంకృషితో అత్యున్నత స్థానానికి చేరుకున్న నేత అప్పిరెడ్డి అని తెలిపారు. సమాజానికి సేవ చేయాలన్న దృక్పథంతోనే ఆయన రాజకీయాల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. అందుకే మొదటి నుంచి కూడా ప్రజోపయోగమైన పనులతోనే ఆయన ముందుకు సాగినట్లు చెప్పారు. అప్పిరెడ్డి స్ఫూర్తితోనే తాము కూడా న్యాయవాదులుగా విరివిగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ క్రమంలోనే ఆయన జన్మదినోత్సవం సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్, ఏరువ జగదీశ్వరి కోటిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గుంటూరులో వైసీపీ బలోపేతానికి, వైఎస్ జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యేందుకు తమ వంతుగా కృషి చేస్తామని పోలూరి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ నేతలు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, కాసు వెంకటరెడ్డి, బడి మంజుల, కళ్ళం వెంకట రమణారెడ్డి, బట్టగిరి వెంకటరమణ, సుదర్శనం క్రాంతి కుమార్, సోని, రాయపూడి శ్రీనివాసరావు, సీడీ భగవాన్, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, వాసం సూరిబాబు, షన్ను, సయ్యద్ బాబు, నలక వేణు, సుబ్బారెడ్డి, శేషకుమారి, వేముల ప్రసాద్, యక్కలూరి కోటి లింగారెడ్డి, రామస్వామిరెడ్డి, వేముల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# రూ.23.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

- పుష్కరాల పనులు, రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలు, ఆరోగ్య ఉపకేంద్రాలకు శ్రీకారం..
- రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు..

**నిర్మల్ అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు సోమవారం శంకుస్థాపనలు చేశారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార,



గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి దాదాపు రూ. 23.35 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించి శంకుస్థాపనలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన రహదారుల నిర్మాణ పనులతో పాటు రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు సంబంధించిన నిర్మాణ పనులకు మంత్రులు శ్రీకారం చుట్టారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందించేందుకు చేపడుతున్న ఈ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులు చర్యలు చేపట్టను న్నారు. జిల్లా పర్యటనకు సోమవారం ఉదయం నిర్మల్ చేరుకున్న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల ఉన్నతాధికారులు డి.ఎస్. లోకేష్ కుమార్, రాజీవ్‌గాంధీ హనుమంతు, వి.పి.గౌతమ్‌లకు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులు ఘన స్వాగతం పలికారు. మంత్రులు, ఉన్నతాధికారులకు కలెక్టర్ భవేశ్ మిశ్రా పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అక్కడి



నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు అభివృద్ధి పనుల శంకు స్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు భవేశ్ మిశ్రా, రాజర్షి షా, హరిత, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, ఆర్ ఎస్ చిత్రు, చంద్రయ్య, రాములు, డేవిడ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ పటేల్, ముదోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఉట్నూర్ ఐటిడిఎపిఓ మంద మకరందు, సబ్ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉసిరి ఆకులపై దివంగత నేత
## మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి



**మంచిర్యాల అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** రవీంద్ర భారతి లో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కాక వెంకటస్వామి 97వ జయంతి వేడుకల్లో ఈ రోజు దివంగత నేత మాజీ కేంద్ర మంత్రి (కాక) గడ్డం వెంకటస్వామి రాజకీయ చరిత్రను ఉసిరి ఆకులపై కొమురం భీం జిల్లా సిర్పూర్(టి) మండలం పెద్దబండ గ్రామానికి చెందిన యువ కళాకారుడు వినయ్ కుమార్ రాసి బహుకరించాడు. కాక వెంకటస్వామి చరిత్రను ఉసిరి ఆకులపై రాసిన వినయ్ కుమార్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జానరెడ్డిలు.. రవీంద్ర భారతిలో కాక వెంకటస్వామి 97వ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్, మంత్రి వివేక్, పెద్దపల్లి ఎంపీ వంశీ ని కలిసి దివంగత నేత జయంతి సందర్భంగా ఉసిరి ఆకులపై దివంగత నేత మాజీ మంత్రి కాక వెంకటస్వామి రాజకీయ చరిత్ర ను రాసిన చిత్ర పటాన్ని బహుకరించాడు.. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం పెద్దబండ గ్రామానికి చెందిన యువ కళాకారుడు దుర్గం వినయ్ కుమార్ వినయ్ కుమార్ కలను రచనను కొనియాడారు. కళాకారుడు వినయ్ కుమార్ గతంలో సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ చరిత్ర ను జమ్మి ఆకులపై రాశాడు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాజకీయ చరిత్ర రావి ఆకులపై రాసి వార్తల్లో నిలిచాడు..

## విద్యార్థి విభాగాన్ని
# బలోపేతం చేస్తాం..

◆ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు..



**కల్వకుర్తి అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం (బీఆర్ఎస్‌వీ) ముఖ్య నాయకులు, పార్టీ నేతలు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తన్నీరు హరీష్‌రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరీష్ రావు, బీఆర్ఎస్ విద్యార్థి విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామని, యువతకు ప్రోత్సాహం కల్పించి, వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నియోజక వర్గంలోని అన్ని మండలాల్లోని విద్యా సంస్థల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా, నిజాయితీగా విధులు నిర్వహించేలా కృషి చేస్తామని బీఆర్ఎస్‌వీ నాయకులు అన్నారు. బీఆర్ఎస్‌వీ యువ నాయకులు తరుణ్ రాథోడ్, శివరాజ్ (వెల్దండ మండలం), బద్ధి రాజు (మాడుగుల మండలం) మాట్లాడుతూ, పార్టీని బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం న్యాయంగా, నిజాయితీగా నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, బీఆర్ఎస్‌వీ యువనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వినతులను త్వరగా పరిష్కరించాలి..



- వివిధ ప్రాంతాల ప్రజల నుండి 131 అర్జీల స్వీకరణ..
- సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి..

**యాదాద్రి భువనగిరి అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరం లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డిలతో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 131 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 73, సర్వే ల్యాండ్స్ 12, మున్సిపాలిటీ 10, వ్యవసాయ 6, జిల్లా పరిషత్ 5, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 4, విద్య శాఖ 3, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీరాజ్ 2, ఉపాధి కల్పన 2, అటవీ 2, పంచాయతీ 2, మైన్స్, వైద్య ఆరోగ్య, పౌర సరఫరాల, ఇరిగేషన్, లేబర్, సమాచార శాఖ, పొల్యూ షన్ కంట్రోల్ బోర్డ్, బీసీ వెల్ఫేర్, శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటి కపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

➤ ఆసుపత్రి ఖర్చుల కోసం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేత..



**యాదాద్రి భువనగిరి అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** నాగార్జునసాగర్ గురుకుల పాఠశాలలోని మూడో అంతస్తు నుంచి మిర్యాల గూడ పట్టణానికి చెందిన గురుకుల విద్యార్థి ఆవుల నరేందర్ ప్రమాదవశాత్తు కిందపడిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఎల్.బీ నగర్‌లోని వెల్‌నాక్స్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందు తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య ఆసుపత్రికి వెళ్లి నరేందర్‌ను పరా మర్శించారు. నరేందర్ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, వైద్యులను అడిగి చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన బీర్ల ఐలయ్య , నరేందర్ పూర్తిగా కోలు కునే వరకు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని నరేందర్ కుటుంబ సభ్యులకు అంద జేశారు. నరేందర్‌కు మెరు గైన వైద్యం అందేలా అవ సరమైన సహాయ సహ కారాలు కొనసాగిస్తామని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు.

# దిశ సర్వసభ్య సమావేశం..

- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష..



**మహబూబ్‌నగర్, అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా లో కేంద్ర ప్రభుత్వ పథకాల కింద అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించేందుకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అధ్యక్షతన మంగళవారం (అక్టోబర్ 6) దిశ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. గత దిశ సమావేశంలో ఇచ్చిన సూచనలు, ఆదేశాల అమలు తీరు, పెండింగ్ అంశాలు, చేపట్టిన చర్యలు, పనుల ప్రస్తుత స్థితి, పురోగతి, కొత్తగా మంజూరైన పనులు, లబ్ధిదారుల వివరాలతో అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండా లని సూచించారు. గత సమావేశం మినిట్స్ ఆధారంగా శాఖల వారీగా యాక్షన్ టేకన్ రిపోర్ట్ (ఏటీఆర్) సమర్పిం చాలని, ఎలాంటి నివేదికలు పెండింగ్‌లో ఉంచవద్దని స్పష్టం చేశారు. దిశ సమావేశానికి అవసరమైన నోట్స్, ప్రెజెంటేషన్ల కోసం పూర్తి వివరాలను ముందుగానే అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో గతంలో ఇచ్చిన సూచనలు, ఆదేశాలపై తీసుకున్న చర్యలకు సంబంధించి స్పష్టమైన వివరాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్ఓ ఎ.నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, జడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు పాల్గొన్నారు.

## రెండు నెలల్లో సమస్యలు పరిష్కరించాలి..
# లేదంటే ఆమరణ దీక్ష..!

◈ మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారసులందరికీ ఉద్యోగాలివ్వాలి..
◈ సింగరేణి లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలి..
◈ సింగరేణి భవన్ ముట్టడి.. నడి రోడ్డుపై గంటకు పైగా ధర్నా
◈ తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరిక..

**హైదరాబాద్, అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రెండు నెలల్లోగా పరిష్కరించకపోతే హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కార్మికుల సమస్యల పరిష్కారం, మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన నాయకులతో కలిసి సోమవారం లక్డీకాపూల్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించారు. నడి ఎండలో గంటకు పైగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. సింగరేణి యాజమాన్యం తమతో చర్చలు జరిపే వరకు కదిలేది లేదని స్పష్టం చేశారు. దీంతో సింగరేణి భవన్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం యాజమాన్యం తరఫున అధికారులు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. సింగరేణి సీఎండీ సెక్రటేరియట్‌లో సమావేశంలో ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకు చర్చలకు వచ్చామని అధికారులు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై కవిత స్పందిస్తూ.. రెండు నెలల గడువు ఇస్తున్నామని, అప్పటిలోగా సమస్యలు పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని స్పష్టం చేశారు. సింగరేణిలో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్‌ఫిట్ చేసి, వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. మూడు నెలల క్రితం ఒత్తిడి తెస్తేనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేశారని, అయితే దరఖాస్తు చేసుకున్న వారిలో కొద్దిమందినే అన్‌ఫిట్ చేస్తున్నారని ఆరోపించారు. "డిపెండెంట్ ఉద్యోగాలు యాజమాన్యం వేసే బిచ్చం కాదు.. కార్మికుల హక్కు" అని కవిత వ్యాఖ్యానించారు. రెండు నెలల్లోగా ప్రక్రియ ప్రారంభించాలని, లేకుంటే సింగరేణి భవన్ గేటు ఎదుట దీక్ష చేపడతానని హెచ్చరించారు.

**లాభాల్లో 35 శాతం కార్మికులకు ఇవ్వాలి :** సింగరేణి లాభాల్లో 35 శాతం కార్మికులకు బోనస్‌గా చెల్లించాలని కవిత డిమాండ్ చేశారు. అలియాస్ పేర్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విజిలెన్స్ విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా బకాయిలు పెట్టిందని, దాంతో సంస్థ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని కవిత పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలను వెంటనే చెల్లించి సింగరేణిని కాపాడాలని డిమాండ్ చేశారు.



**"సింగరేణి బాగుంటేనే తెలంగాణ బాగుంటుంది" :** దేశానికి వెలుగునిస్తున్న సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యం పట్టించుకోవడం లేదని కవిత విమర్శించారు. "సింగరేణి తెలంగాణకు ఆత్మవంటిది. కార్మికుల సంక్షేమం కోసం టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ కలిసి పోరాటం చేస్తాయి" అని అన్నారు.

**సింగరేణి ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దు :** హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. సింగరేణి స్వతంత్ర సంస్థగా ఉండాల్సినప్పటికీ రాజకీయ జోక్యం పెరిగిందని విమర్శించారు. కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం దృష్టి పెట్టాలని కోరారు. డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించడంతో పాటు కొత్త బొగ్గు బావులను ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా సింగరేణి ఆధ్వర్యంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నైనీ బ్లాక్‌లోనూ సింగరేణి కార్మికులను నియమించాలని కోరారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

- నాలుగు ట్రాక్టర్లు పట్టివేత.. కేసులు నమోదు

**కరీంనగర్ ప్రతినిధి, అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని సంబంధిత యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. కరీంనగర్ రూరల్ ఎస్సై ఎ. లక్ష్మారెడ్డి సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం రూరల్ మండల పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి వాగు నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను కరీంనగర్ వైపు తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు అప్రమత్తమై ముగ్దుంపూర్ వద్ద ఒక ట్రాక్టర్, దుర్శేడు వద్ద రెండు ట్రాక్టర్లు, లారీ అసోసియేషన్ సమీపంలో మరో ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లకు సంబంధించి గొబ్బల విశ్వనాథరెడ్డి, గొబ్బల విలాసరెడ్డి, దాసరి సంపత్, వీర్ల సంపత్, సప్పట్ల సంపత్, పున్న గంగరాజు, దాసరి శ్రీనివాస్ తదితరులు యజమానులు, డ్రైవర్లుగా ఉన్నట్లు పోలీసులు



గుర్తించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. నాలుగు ట్రాక్టర్లను పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్న పోలీసులు, సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసులు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

**అక్రమ రవాణాపై కఠిన చర్యలు**

అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఎన్. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలో ఎంతటి వారైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తవ్వినా, తరలించినా, అక్రమంగా విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అవసరమైతే నిందితులపై రౌడీషీట్ కూడా తెరుస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణా, అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని సిఐ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు సంబంధిత వ్యక్తులపై కరీంనగర్ రూరల్ తహసీల్దార్ వద్ద బైండోవర్ చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

## ఇందిరమ్మ కమిటీ స్థానంలో గ్రామసభలో అర్హులను ఎంపిక చేయాలి

- పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ
- బీఆర్ఎస్ సర్పంచులతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్‌కి వినతి



**పాలేరు, అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** పాలేరు నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీల స్థానంలో సర్పంచ్,గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలోనే గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ను పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి కోరారు.సోమవారం పాలేరు నియోజకవర్గంలోని బిఆర్ఎస్ సర్పంచులు, ఉప సర్పంచులు,వార్డు సభ్యులతో కలిసి ఐడిఓసిలో కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.తొలుత దానవాయుగూడెం సబ్ జైలు లో ఉన్న తిరుమలాయపాలెం మండలంలోని సుద్దవాగుతండాకి చెందిన బానోత్ రవి,మోహన్,కిషన్ లను పరామర్శించారు.వారితో మాట్లాడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.త్వరలోనే అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బానోత్ భిక్షం నాయక్, సైదులు,భూక్యా వసంత,భూక్యా పుష్ప,బానోత్ మహేష్,కొలిశెట్టి శ్రీనివాస్,దాట్ల సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

# జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**ఖమ్మం , అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** ఘనంగా 'జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్' ఉచిత వైద్య శిబిరం ద్వారా, ఉచిత ఎముకల వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు ఈ శిబిరంలో 83 మంది ఎముకల సంబంధిత రోగులను పరీక్షించాము; అలాగే 31 ఉచిత X-rayలు, 34 ఉచిత ఎముకల సాంద్రత (Bone Mineral Density) పరీక్షలు, 49 ఉచిత యూరిక్ యాసిడ్ పరీక్షలు మరియు 8 ఉచిత ESR పరీక్షలను నిర్వహించగలిగాము.BMD స్కాన్ : 49ESR : 8యూరిక్ యాసిడ్ : 8ఎక్స్-రే : 34జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్' వైద్య సేవలను ప్రజలకు ఉచితంగా అందించింది.ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ కుమార్ జంగాల మాట్లాడుతూ.. "2017 ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నాడు స్థాపించబడిన ఈ ఫౌండేషన్ ద్వారా నిరంతరం కాలేయ రక్షణపై పోరాడుతున్నాం. హెపటైటిస్-బి పట్ల అప్రమత్తంగా ఉండటం ద్వారా కాలేయ క్యాన్సర్ వంటి ముప్పుల నుండి తప్పుకోవచ్చు" అని తెలిపారు.గత కొన్నేళ్లుగా రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, సమాజంలో ఆరోగ్య చైతన్యం నింపుతోంది. ఈ కార్యక్రమంలో క్లినిక్ సిబ్బంది మరియు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పద్మశాలి భవన్‌లో వైభవంగా 'పద్మశాలి ఇంజనీర్స్ డే'

- అన్ని రంగాల్లో పద్మశాలీలు రాణించాలి: ఎమ్మెల్సీ ఎల్. రమణ పిలుపు




**హైదరాబాద్, అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :** నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో అఖిల భారత పద్మశాలి ఇంజనీర్స్ విభాగ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య అధ్యక్షతన 'పద్మశాలి ఇంజనీర్స్ డే' వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) ఎల్. రమణ మాట్లాడుతూ... పద్మశాలీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా మరియు విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించి సమాజంలో అగ్రగామిగా నిలవాలని పిలుపునిచ్చారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను ఇంజనీర్లు మార్గదర్శకంగా తీసుకుని దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. సమాజంలో మహిళల పాత్ర కీలకమని, చట్టసభలతో పాటు అన్ని రంగాల్లో వారికి 33 శాతం రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు, యువత కోసం ఉచిత కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, విదేశీ విద్యపై కౌన్సెలింగ్, మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన యువతకు పురస్కారాలు అందజేయడమే కాకుండా, పలు ఉద్యోగ ఖాళీల కోసం రెజ్యూమ్‌లను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, నాయకులు మసున మోహన్ నారాయణ, చిలుకూరి చంద్రమౌళి, చింతకింది విజయ ప్రసాద్, కస్తూరి శ్రీనివాసులు, వనం దుష్యంతల, వద్నాల శ్రీహరి, కొక్కుల దేవేందర్, గుంటక రూపా, పోరండ్ల శారద సునీత, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి ఎంఎస్ పి కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- రైతులకు మద్దతు ధర అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్లు అందుబాటులో ఉంచాలి
- నోటిఫై చేసిన 8 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి





**ఖమ్మం , అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :**

026-27 సీజన్‌లో పత్తి కనీస మద్దతు ధర కు కొనుగోళ్లను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్ల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా పత్తి సాగు విస్తీర్ణం, అంచనా దిగుబడి, కొనుగోలు కేంద్రాలు, రైతుల నమోదు, నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం, వెయిమెంట్, చెల్లింపులు, భద్రత తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2026-27 సీజన్‌కు పత్తి కనీస మద్దతు ధర (MSP)ను క్వింటాల్‌కు రూ. 8,667గా నిర్ణయించిందన్నారు. 2025-26 సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 8,110 ఉండగా, ప్రస్తుతం రూ. 557 పెంచినట్లు తెలిపారు. మీడియం స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ. 8,267, లాంగ్ స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ. 8,667 మద్దతు ధరగా నిర్ణయించబడిందని తెలిపారు.2026-27 సీజన్‌లో ఖమ్మం జిల్లాలో 2,35,637 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గత ఏడాది 2,25,613 ఎకరాల్లో పత్తి సాగు కాగా, ఈ ఏడాది 10,024 ఎకరాల మేర సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు.

### రైతుల వివరాలను కపాస్ కిసాన్ యాప్‌కు అనుసంధానం చేయాలి

పత్తి కొనుగోళ్లలో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. నిజమైన పత్తి రైతులను గుర్తించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కౌలు రైతులను తాత్కాలికంగా డేటాబేస్‌లో నమోదు చేసే విధానాన్ని అమలు చేయాలని తెలిపారు.పత్తి సాగు చేస్తున్న రైతుల వివరాలను ఎన్ఐసి ద్వారా కపాస్ కిసాన్ యాప్‌కు బదిలీ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అగ్రి స్టాక్‌ను కపాస్ కిసాన్ యాప్‌తో అనుసంధానం చేసి రైతుల వివరాలు, సేవల పంపిణీని మరింత సులభతరం చేసేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు, సిసిఐ సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### అంతర్ జిల్లా మ్యాపింగ్‌ను ముందుగానే పూర్తి చేయాలి

పత్తి కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అంతర్ జిల్లా మ్యాపింగ్ ప్రతిపాదనలను ముందుగానే ఖరారు చేసి సిసిఐ పరిశీలనకు పంపాలని కలెక్టర్ సూచించారు. కొనుగోళ్లు ప్రారంభమయ్యే నాటికి అవసరమైన అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు.రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాక ముందే తేమ శాతాన్ని పరిశీలించుకునేలా జిల్లాలోని 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖను కలెక్టర్ ఆదేశించారు. తేమ శాతం అధికంగా ఉండటం వల్ల పత్తి తిరస్కరణకు గురికాకుండా రైతులకు ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు.

### టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లపై విస్తృత ప్రచారం

పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు 1800 599 5779 టోల్‌ఫ్రీ నంబర్, 88972 81111 వాట్సాప్ నంబర్‌ను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి రైతుల సమస్యలను ప్రతిరోజూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం ద్వారా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఎఫ్ఏక్యూ ప్రమాణాలు, స్లాట్ బుకింగ్ విధానం, టోల్‌ఫ్రీ నంబర్, కొనుగోలు కేంద్రాల వివరాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బ్రోచర్లు, వాల్ పోస్టర్లు, కర పత్రాలు, బ్యానర్లు, టీవీ చానళ్లతో పాటు బల్క్ మెసేజ్‌ల ద్వారా కూడా రైతులకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

### కొనుగోలు స్లాట్ల వివరాలను ముందుగానే తెలియజేయాలి

సిసిఐ అధికారులు పత్తి కొనుగోలు స్లాట్ల ప్రారంభ వివరాలను జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారి, మార్కెట్ కమిటీ కార్యదర్శులకు ముందుగానే అందించాలని కలెక్టర్ సూచించారు. తద్వారా రైతులకు ముందస్తుగా సమాచారం అందించి కొనుగోలు ప్రక్రియను క్రమబద్ధీకరించాలని తెలిపారు. కొనుగోళ్లు ప్రారంభమైన వెంటనే అన్ని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లులను కార్యకలాపాల్లోకి తీసుకురావాలని సూచించారు. రైతులు సమీపంలోని జిన్నింగ్ మిల్లుకు పత్తిని తరలించుకునే అవకాశం కల్పించడం ద్వారా రవాణా ఖర్చు తగ్గుతుందని తెలిపారు. అన్ని మిల్లులను ఒకేసారి ప్రారంభించడం ద్వారా కొన్ని మిల్లుల్లో మాత్రమే ముడి పత్తి నిల్వలు పేరుకుపోకుండా నివారించవచ్చని పేర్కొన్నారు.

### 8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై

2026-27 సీజన్‌లో ఖమ్మం జిల్లాలో పత్తి కొనుగోళ్ల కోసం 8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం, మద్దులపల్లి, మధిర, వైరా ప్రాంతాల్లోని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

### అగ్నిమాపక భద్రతా పరికరాల తనిఖీలు పూర్తి చేయాలి

కొనుగోలు కేంద్రాలుగా ప్రతిపాదించిన జిన్నింగ్ మిల్లుల్లో అగ్నిమాపక భద్రతా పరికరాల తనిఖీలను అత్యవసరంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అగ్నిమాపక అధికారి అన్ని ప్రతిపాదిత జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేసి, అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిన్నింగ్ మిల్లుల్లోని అన్ని వేయింగ్ బ్రిడ్జ్‌లను కొనుగోళ్లు ప్రారంభానికి ముందే తనిఖీ చేసి, క్యాలిబ్రేషన్‌ను నిర్ధారించాలని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు సీజన్ మొత్తం వేయింగ్ బ్రిడ్జ్‌లను తరచుగా తనిఖీ చేస్తూ ఖచ్చితమైన తూకం జరిగేలా చూడాలని సూచించారు. మాయిశ్చర్ మీటర్ రీడింగులు, ఎఫ్ఏక్యూ ప్రమాణాల రీడింగులు, వెయిమెంట్ డేటాను సిస్టమ్ సాఫ్ట్‌వేర్‌తో డిజిటల్‌గా అనుసంధానం చేసే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిన్నింగ్ మిల్లులు, మార్కెట్ యార్డుల్లో అవసరమైన సమయంలో పోలీసు భద్రత కల్పించాలని కలెక్టర్ సూచించారు. పత్తి బేళ్ల రవాణాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసు, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.అన్ని పత్తి కొనుగోలు కేంద్రాలు, నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

### కనీస మద్దతు ధర ప్రయోజనం పొందేందుకు ఆధార్ ధృవీకరణ తప్పనిసరి

కనీస మద్దతు ధర ప్రయోజనాలను పొందేందుకు రైతులు ఆధార్ ఆధారిత ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పత్తి కొనుగోలు, చెల్లింపుల ప్రక్రియను ఆధార్ ధృవీకరించిన బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేయనున్నందు న రైతులు తమ ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సంతోష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, సిసిఐ, అగ్నిమాపక, లీగల్ మెట్రాలజీ, పోలీస్, రవాణా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

- కాంగ్రెస్ నాయకులకు "కోనేరు చిన్ని" పిలుపు

**ఖమ్మం , అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకు నేందుకు అర్హులైన గ్రాడ్యుయేటర్లు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ(చిన్ని) ప్రకటనలో కోరారు.ఫాం -18 ద్వారా 2023 నవంబర్ నాటికి డిగ్రీ,లేదా దానికి సమానమైన డిప్లొమా పూర్తి చేసిన వారు ఓటరుగా నమోదు చేసుకో వాలని కోరారు. వచ్చే నెల 6 తేదీ లోగా దరఖాస్తు చేసు కోవాలని కోరారు.ఓటర్ ఐడి కార్డు,ఆధార్ కార్డు,డిగ్రీ / గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్,పాస్పోర్ట్ సైజ్ ఫోటో,మొబైల్ నంబర్ తో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు అర్హులైన వారికి విజ్ఞప్తి చేశారు.



## అభివృద్ధి, పేదల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం : రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల

- అర్హులైన ప్రతి నిరుపేదకూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలి
- విద్యా, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత
- నగరంలోని 48 వ డివిజన్ లో 1.80 కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి





**ఖమ్మం , అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ పరిధిలోని ఎఫ్ సిఐ బైపాస్ రోడ్డు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ నుండి ఎంబి గార్డెన్స్ వరకు రూ. 180.00 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు కళ్యాణలక్ష్మి , సీఎం రిలీఫ్ ఫండ్, తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి ప్రభుత్వ పథకాలు ఖచ్చితంగా అందాలని అన్నారు. ఇళ్లు కేటాయించేటప్పుడు గుడిసెలలో నివసించే నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డివిజన్‌లో ప్రజలకు అవసరమైన డ్రెయిన్లు, పార్కులు, రోడ్లు, మంచినీటి వసతి, విద్యుత్ లైన్ల వంటి మౌళిక వసతుల పనులను వెంటనే మంజూరు చేయించి వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పేదరికం నుండి శాశ్వత విముక్తి పొందేందుకు చదువు ఒక్కటే మార్గమని మంత్రి అన్నారు. ఖమ్మంలో ముఖ్యమంత్రి సహకారంతో మోడల్ స్కూళ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో పాటు కొత్తగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.1.25 లక్షలు వెచ్చించి ఉచితంగా ఇంగ్లీష్ మీడియం విద్య, వసతి, పుస్తకాలు, దుస్తులు అందిస్తోందని అన్నారు. నగరంలో కబ్జాలు, దౌర్జన్యాలు, పోలీస్ కేసుల ఇబ్బందులు లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలు, ప్రశాంతతతో జీవించాలన్నదే తమ ఆకాంక్ష అని మంత్రి స్పష్టం చేశారు. రాబోయే దసరా పండుగ సందర్భంగా మహిళలకు ముఖ్యమంత్రి కానుకగా చిలక పచ్చ చీరల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధికి ప్రజలందరూ బాధ్యతాయుతంగా తమ వంతు కృషి చేయాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచందర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి కొత్తగూడెం పేరు పెట్టాలని డిమాండ్

- అఖిలపక్ష నేతలు అదనపు కలెక్టర్ పి.శ్రీజకు వినతి



**ఖమ్మం , అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :**

కొత్తగూడెం రెవెన్యూ పరిధిలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, కళ్యాణ మండపం మరియు ఇతర నిర్మాణాలకుసంబంధించిన శిలాఫలకాలపై కొత్తగూడెం పేరు పెట్టాలని ఖమ్మం నగరంలోని కొత్తగూడెం ప్రాంతానికి చెందిన 14వ మరియు 15వ డివిజన్ల అఖిలపక్ష నేతలు. పగడాల మల్లేష్,యర్రబోయిన గోవిందరావు, చేతుల నాగేశ్వరరావు, మొర్రి మేకల కోటయ్య, రావుల హనుమంతరావు డిమాండ్ చేస్తూ సోమవారం ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ టి. శ్రీజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం రెవెన్యూ పరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం,కళ్యాణ మండపం తదితర నిర్మాణాలు చేపడుతున్న విషయం విదితమే. అయితే, ఈ నిర్మాణాలకుసంబంధించి పత్రికా, ఇతర ప్రచార మాధ్యమాలలో ఈ ప్రాంతాన్ని అల్లీపురం పేరుతో పేర్కొనడం స్థానిక ప్రజల దృష్టికి వచ్చిందని తెలిపారు. వాస్తవానికి, దేవాలయ నిర్మాణం జరుగుతున్న స్థలం, పి.బి. నగర్ ప్రాంతం మరియు సంబంధిత భూములు, సర్వే నంబర్లు అన్నీ కొత్తగూడెం రెవెన్యూ పరిధిలోనే ఉన్నాయన్నారు.అటువంటప్పుడు, కొత్తగూడెం ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఆధ్యాత్మిక కట్టడాలకు అలీపురం పేరును మాత్రమే ప్రస్తావించడం వల్ల స్థానిక ప్రజలలో కొంత అసంతృప్తి నెలకొంటోంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కొత్తగూడెం ప్రాంత ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశంగా మారిందని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను, వాస్తవ రెవెన్యూ పరిధిని పరిగణనలోకితీసుకొని, టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, కళ్యాణ మండపంమరియు ఇతర నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలు, ప్రారంభోత్సవ ఫలకాలు, అధికారికరికార్డులు, ప్రచార ప్రకటనలు మరియు ఇతరత్రా అన్ని సందర్భాలలో 'కొత్తగూడెం' లేదా'కొత్తగూడెం–అల్లిపురం రోడ్డు' అనే పేరును స్పష్టంగా పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కొత్తగూడెం ప్రాంత ప్రజలు అఖిలపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక పెద్దల సమక్షంలో చర్చించి, ఏకాభిప్రాయంతో తీర్మానం చేయడం జరిగిందని గౌరవ మంత్రి వర్యులు ఈ విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి,కొత్తగూడెం ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అఖిల పక్ష నాయకులు మాకెనబోయిన నాగేశ్వరరావు, పల్లెబోయిన పుల్లారావు, బొమ్మిశెట్టి లక్షి నర్సయ్య, పొదిల ఉపెందర్, యర్రబోయిన వెంకటయ్య, నాగటి శేషయ్య, పర్వత సైదులు, పొదిల రామారావు, బొమ్మిశెట్టి భాస్కర్, చామకూరి శంఖర్, చిర్ర శంఖర్, పడగాల వెంకటేశ్వర్లు, దంతాల నాగరాజు, షేక్ మీరా, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, లింగనబోయిన దాసు, బండ్ల వెంకటేశ్వర్లు, కర్రి కృష్ణ, మొర్రిమేకల వెంకటనారాయణ, అమరయ్య, చిగంటి శ్రీను, పగడాల అనంతరాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ జగదీష్ ను పరామర్శించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం , అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఇటీవల ప్రమాదానికి గురైన తిరుమలాయపాలెం సబ్ ఇన్స్పెక్టర్ కూచిపూడి జగదీష్ ని సోమవారం ఖమ్మం లోని వారి నివాసం నందు పరామర్శించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి సోదరుడు, తుమ్మల అభిమాని జై చౌదరి, సుడా చైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు ,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ,ఖమ్మం అర్బన్ డిసిసి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుపాకుల యలగొండ స్వామి,సాధు రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రానికి శంకుస్థాపన

**ఖమ్మం , అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :**



ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి దివ్య అనుగ్రహంతో ఖమ్మం నగరంలో మరో మహత్తర ఆధ్యాత్మిక అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది అని ఖమ్మం నగర పాలక సంస్థ 15 వ డివిజన్ మాజీ, తాజా కార్పొరేటర్ రావూరి కరుణ, పిఏసి ఎస్ ఛైర్మెన్ రావూరి సైదుబాబు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతిపాదిత శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రానికి ఈ నెల 12వ తేదీన శంకుస్థాపన కార్యక్రమం ఖమ్మం నగరంలో గల కొత్తగూడెం, అల్లిపురం రోడ్డులో ఘనంగా నిర్వహించనున్నారు అని తెలిపారు. ఈ దివ్యక్షేత్రంలో భక్తుల ఆధ్యాత్మిక సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీ ఆండాళ్ అమ్మవారి ఆలయం, మూడు అంతస్తుల రాజగోపురాలు, నాలుగు మాడ వీధులు, స్వామివారి పుష్కరిణి, వాహన మండపం వంటి ప్రత్యేక నిర్మాణాలు ప్రతిపాదించారు. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం అన్నదాన సముదాయం, యాత్రికుల నిరీక్షణ మందిరం, షూ కీపింగ్, వసతి గదులు, డార్మిటరీలు, కార్యాలయ భవనం, అర్చకులు మరియు సిబ్బంది నివాసాలు, మరుగుదొడ్ల సముదాయం, పార్కింగ్ సౌకర్యం తదితర వసతులు కూడా ఈ ప్రణాళికలో ఉన్నాయి. మొత్తం 20 ఎకరాల విస్తీర్ణంలో ఈ దివ్యక్షేత్రం రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఆలయం కాదు, ఖమ్మం ఆధ్యాత్మిక వైభవానికి చిరస్థాయిగా నిలిచే దివ్యక్షేత్రం.శ్రీవారి దర్శనం, ఆధ్యాత్మిక ప్రశాంతత, భక్తులకు సౌకర్యాలు, అన్నీ ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి రానున్నాయి.శంకుస్థాపన మహోత్సవానికి భక్తులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీనివాసుని కృపకు పాత్రులు కావాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము అని వారు తెలిపారు.

## డాదిన్నరలోగా రాష్ట్రంలో భూసర్వే పూర్తికి చర్యలు

- ఇళ్ల నిర్మాణానికి అటవీ భూముల అడ్డంకిపై రాష్ట్రస్థాయి భేటీ





**హైదరాబాద్, అక్టోబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాష్ట్రంలో భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో చేపట్టిన సర్వే కార్యక్రమాన్నివచ్చే ఏడాదిన్నరలోగా ప్రతి గ్రామంలో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సుమారు 125 ఏళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని, భూముల సమగ్ర సర్వేతో భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చూడవచ్చని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సోమవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై మంత్రి పొంగులేటి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సర్వేను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అదనపు సామగ్రిని సమకూరుస్తామని తెలిపారు. యువ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో భూ సర్వేను దశలవారీగా నిర్వహించి, ప్రతి భూ కమతానికి ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) నంబర్ కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. భూములకు సంబంధించిన సమగ్ర వివరాలను నమోదు చేసి, భూ హక్కులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించి, తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 72 వేల నుంచి 73 వేల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టగా, రెండో దశలో మరో రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అటవీ సంబంధిత సమస్యల కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోకుండా, పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సూచించారు. అవసరమైతే ఈ అంశంపై రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి , సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో ఆరు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం




**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో ఆరు నూతన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం అయ్యాయి. గ్రామీణ ప్రజలకు ముంగిట్లోనే మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో నూతన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం అయ్యాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వర్చువల్ విధానంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 265 ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే 105 రకాల మందులు, 14 రకాల ఉచిత వైద్య పరీక్షలు అందుబాటులోకి కూటమి ప్రభుత్వం తీసుకువచ్చింది. గుంటూరు జిల్లాలో పెదపలకలూరు పి. హెచ్. సి పరిధిలో లాలుపురం, చేబ్రోలు పి. హెచ్. సి పరిధిలో చేబ్రోలు 2, కొలకలూరు పి. హెచ్. సి పరిధిలో కొండలకలూరు (ఉత్తర), కటీవరం, ఈమని పి. హెచ్. సి పరిధిలో ఈమని – 1, ఈమని – 2 లలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం అయ్యాయి.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గుంటూరు జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల చెంతకు ఆరోగ్య సేవలు అందించాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. సంజీవని వంటి ప్రాజెక్టులు అమలు చేస్తూ ఆరోగ్య భరోసా కల్పిస్తుందని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యకర జీవనం సాగిస్తూ కుటుంబానికి ఆర్థిక భరోసా అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మక్కెన పద్మావతి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి. శ్రీనివాస్, డిప్యూటీ డి. ఎం. హెచ్. ఓ ఇ. అన్నపూర్ణ, వైద్య ఆరోగ్య శాఖ డి. పి. ఎం సుజాత, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయన్, తదితరులు పాల్గొన్నారు.

## నందివెలుగు ఆర్వోబీ పనులు వేగవంతం చేయాలి



- నగర కమిషనర్ కె. మయూర్ అశోక్

**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** నందివెలుగు రైల్వే వంతెన (ఆర్వోబీ) నిర్మాణ పనులను రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతం చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం రైల్వే, జీఎంసీ, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి నందివెలుగు రోడ్డులో జరుగుతున్న ఆర్వోబీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

వంతెన పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అదనపు సిబ్బంది, కార్మికులను కేటాయించి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. పనుల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం రైల్వే గేట్‌ను రెండు రోజుల పాటు మూసివేసి పనులు పూర్తి చేసేందుకు రైల్వే, ట్రాఫిక్, జీఎంసీ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వంతెన ప్రారంభానికి ఇప్పటికే గడువు నిర్ణయించినందున పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పర్యటనలో జీఎంసీ సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ సుందరరామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి.. 8 మంది అరెస్ట్



**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** అరండలపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వసంతరాయపురం 7వ లైను చివం-లోని వుడ్ వర్క్ తయారీ రేకుల షెడ్డులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సోమవారం సాయంత్రం 6.20 గంటలకు పోలీసులు దాడి నిర్వహించారు.

ఎస్‌బీ డీఎస్పీ దృష్టికి సమాచారం తీసుకెళ్లిన అనంతరం టాస్క్‌ఫోర్స్ సీఐ-2 పర్యవేక్షణలో అరండలపేట ఎస్ఐ అశోక్, ఎస్‌బీ స్టేషన్ సిబ్బందితో కలిసి ఈ దాడి చేపట్టారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ. 3,180 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లను తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల కోసం అరండలపేట పోలీస్ స్టేషన్ సిబ్బందికి అప్పగించారు.

# పేదల ఆరోగ్యానికి రక్షణ కవచం 'సీఎంఆర్ఎఫ్'

- వైద్యం కోసం ఏ ఒక్కరూ అప్పుల పాలుకాకూడదు
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- రూ.76 మందికి రూ.1.46 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచంలా నిలుస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు కార్యాలయంలో 76 మందికి రూ. 1.46 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, నిరుపేదల ప్రాణాలను నిలబెట్టడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి వరంగా మారిందని చెప్పారు. నియోజకవర్గంలో తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్న బాధితులకు ప్రభుత్వం నుంచి సహకారం లభిస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరూ సరైన వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని వేగవంతంగా అందిస్తోందన్నారు. గతంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందడంలో తీవ్ర జాప్యం జరిగేదని, అయితే ఇప్పుడు దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి నేరుగా బాధితులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలు మరియు ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ లేదా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది అప్పులపాలైన కుటుంబాలకు ఈ సహాయం ఎంతో మేలు చేస్తుందన్నారు. ఆర్థిక సహాయం అందుకోవడంతో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. వైద్య ఖర్చుల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న సమయాన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే నసీర్ కొండంత అండగా నిలిచారని బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.

# 11 నుంచి వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రులు

- శరన్నవరాత్రుల మహోత్సవ ఆహ్వాన పత్రికను ప్రారంభించిన ఆర్యవైశ్య సభ



**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్):** కడప జిల్లా బ్రహ్మంగారిమఠం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు ఈనెల 11వ తేదీ నుండి 21వ తేదీ వరకు దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యప్ప వెంకట సురేష్ బాబు మంగళవారం స్థానిక అమ్మవారి శాల యందు దేవి శరన్నవరాత్రుల మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఆవిష్కరించి పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. ప్రతిరోజు ప్రాంతఃకాల పూజ మహన్యాస రుద్రాభిషేకం చండీ పారాయణం శ్రీ చక్ర నవ వర్ణార్చన గణపతి హోమం రుద్ర స్వాహకార హోమం దుర్గా హోమం లక్ష్మీనారాయణ హోమం సుదర్శన హోమం లక్ష్మీ నరసింహ స్వామి హోమం వాసవి కన్యకా పరమేశ్వరి హోమం లక్ష్మీ కుబేర హోమం నవగ్రహ హోమం వాస్తు హోమం ఉపగ్రహ హోమం మహా మంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించబడును సాయంత్రం ప్రదోషకాల పూజ దేవి భాగవత పారాయణ శ్రీ చక్ర అర్చన మహాలింగార్చన కుంకుమార్చన మహా మంగళ హారతి వేద స్వస్తి అలంకారం గురించి విశేష ప్రవచనం ఉత్తర నీరాజనం తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు కార్యదర్శి సుంకు సురేష్ కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు యువజన సంఘం అధ్యక్షులు యాదాళ్ల వెంకటసుబ్బయ్య మహిళా మండలి అధ్యక్షులు ముచ్చర్ల పద్మజ తెలిపారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో మండలంలోని అన్ని ప్రాంతాల వారు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాల స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులగుదలని కొనియాడారు. 11 వ విశ్వగురు ఇండియన్ ఐకాన్ అవార్డు గ్రహీత డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం గారిచే భక్తి గాన లహరి 17 వ తేదీ మూల నక్షత్రం రోజున బిందెసేవ కార్యక్రమం నిర్వహించబడును అని తెలిపారు..

# బయోచార్ ఉత్పాదకతపై దృష్టి సారించాలి : కలెక్టర్ సాయికాంత్ వర్మ



**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో బయోచార్ ఉత్పాదకతపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో బయోచార్ ఉత్పాదకతపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బయోచార్ ఉత్పాదకత, వినియోగం వలన భూమికి సేంద్రియ కర్బనం అందించి సారవంతం చేస్తుందన్నారు. నేలలో నీటిని నిలుపుకునే శక్తిని పెంచుతుందని అన్నారు. మొక్కలకు పోషకాలను అందించే మంచి సూక్ష్మజీవుల వృద్ధికి సహకరిస్తుందని, వ్యర్థాలను బహిరంగంగా కాల్చడం తగ్గించి కాలుష్యాన్ని నివారిస్తుందన్నారు. బయోచార్ ఉత్పాదకతకు ముందుగా కొంత మంది ఆసక్తిగల రైతులతో చేయించాలని సూచించారు. బయోచార్ వినియోగం పట్ల రైతులకు అవగాహన, నమ్మకం కలగాలని తద్వారా వినియోగం పట్ల దృష్టి సారించగలరని చెప్పారు. బయోచార్, వర్మీ కంపోస్టు, జీవామృతం వినియోగం వలన మేలు కలుగుతుందన్నారు. మిరప, పత్తి, ఉలవలు వంటి పంటలకు ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. దీని వినియోగం వలన పంట ఆరోగ్యం, ఉత్పత్తి వంటి అంశాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. బయోచార్ వినియోగం వలన బయోమాస్ ఉత్పాదకత వస్తుందని, పంటలకు ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయం క్రింద చేపట్టనున్న 75 వేల ఎకరాలలో దీనిని అమలుకు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ఒక్కో ప్రాంతంలో ఒక ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శంకర్, డి. ఆర్. డి. ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయ లక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి, ప్రకృతి వ్యవసాయం డి. పి. ఎం రాజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంగోలి కార్యక్రమం



**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ హిందూ మహిళా డిగ్రీ కళాశాలలో రంగోలి కార్యక్రమం నిర్వహించారు.

బీజేపీ మూడో మండల అధ్యక్షురాలు గాయత్రి బెహరా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థినులు రంగోళ్ల ద్వారా సృజనాత్మకంగా ప్రదర్శించారు.

మోదీ జన్మదినం నుంచి నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్‌లో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తిరుపతిరావు తెలిపారు. అనంతరం రంగోలి పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా మోర్చా ప్రతినిధులు, సేవా సంకల్ప్ అభియాన్ నిర్వాహకులు, టీడీపీ ప్రతినిధులు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# అప్పిరెడ్డి జన్మదినం - అందరికీ పర్వదినం

- గుంటూరులో ఘనంగా లేళ్ళ అప్పిరెడ్డి పుట్టినరోజు వేడుకలు
- వాడవాడలా వినూత్న సేవా కార్యక్రమాలు
- అంబరాన్నంటిన అభిమానుల సంబరాలు



**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజాబలంతో ఎదిగిన శక్తివంతమైన ప్రజానేత.. సమర్ధవంతమైన రాజకీయ వేత్త.. విద్యార్థులను ఆదుకునే విద్యా దాత.. యువతకు భవిత.. ఎందరికో స్ఫూర్తి ప్రదాత.. అందరికీ చేయూత.. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. రాజన్న ఆశయాలు – జగనన్న ఆదర్శాలు కలబోత.. నిర్మలత.. నిరాడంబరత.. నిరంతర సేవా తత్పరత.. ఆత్మీయత.. ఆప్యాయత.. తదితర ప్రత్యేకతలతో ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాముఖ్యత నిచ్చే విశిష్టత సొంతంగా గల నేత అని ప్రశంసించారు.

శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి పుట్టినరోజు వేడుకలు గుంటూరులో ఘనంగా జరిగాయి. స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో జరిగిన పుట్టినరోజు వేడుకలలో అభిమానులు, పార్టీ శ్రేణుల కోలాహలం నడుమ పలువురు నేతలు బర్త్ డే కేక్ కట్ చేశారు. అనంతరం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గెద్దేటి సురేంద్ర ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి జన్మదినోత్సవంపై ప్రత్యేకంగా రూపొందించిన పాటను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, లేళ్ళ అప్పిరెడ్డి పుట్టినరోజు అంటే అటు ఆయన అభిమానులకే కాక ఇటు వైసీపీ శ్రేణులకు సైతం పర్వదినమేనని వ్యాఖ్యానించారు. మరే ఇతర నాయకుడికీ ఎప్పుడూ.. ఎక్కడా.. జరగని విధంగా గుంటూరులో వాడవాడలా వినూత్న సేవా కార్యక్రమాలు, అన్నదానాలు, దుస్తులు, చీరలు, పండ్లు, మిఠాయిల పంపిణీలతో.. అంబరాన్నంటిన అభిమానుల సంబరాల నడుమ పెద్ద ఎత్తున జరిగిన ఆయన జన్మదినోత్సవ వేడుకలే అందుకు ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు.

నిత్యం కులాల చుట్టూ తిరుగుతుంటారు కానీ... ఆయనకు కులం లేదని, అన్ని మతాల వారి అభిమతంతో ఏకీభవిస్తుంటారు కానీ... ఆయనకు మతం లేదని, ఆయన కులం – ప్రజా సేవ"కులం" – ఆయన మతం – ప్రజల అభి"మతం" అని స్పష్టం చేశారు. జగమంత కుటుంబంతో జగన్‌నే దైవంగా కొలిచే లేళ్ళ అప్పిరెడ్డి కలకాలం ప్రజాసేవలో తరించాలన్న ఆకాంక్షను ప్రతి ఒక్కరూ వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మందపాటి శేషగిరిరావు, గులాం రసూల్, బత్తుల దేవానంద్, మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, అంబేద్కర్, పడాల సుబ్బారెడ్డి, అచ్చాల వెంకటరెడ్డి, గురవయ్య, వంశీ, బోడపాటి కిషోర్, గేదెల రమేష్, జోయెల్, వెలుగూరి రత్నప్రసాద్, ముత్యం, సత్యనారాయణరెడ్డి, పరిశపోగు శ్రీనివాసరావు, శేషగిరి పవన్, కాకి శ్రీనివాసరావు, ఉడతా కృష్ణ, పోకల వసంత్, వాసిమళ్ళ విజయ్, ఆలా కిరణ్, నరాలశెట్టి అర్జున్, ఓర్చు శ్రీనివాసరావు, మురళి, బైరెడ్డి రవీంద్రారెడ్డి, సింగు నరసింహరావు, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, కొత్తపేట సతీష్, రామిరెడ్డి, ప్రభు, శంకర్, సుబ్బరాజు, యాదాల చిన్న, ఆర్నాల్డ్, చిన్న, ఏటిగడ్డ వెంకటరెడ్డి, రెడ్డి కోటేశ్వరరావు, మంత్రి మహానంది, బెంజి, ఫాజిల్, సుందరరావు, భాగ్యారావు, సుశీలరావు, నీలి, దాసు, కొండలరావు, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సుభిక్షం కోసం వరుణ హోమాలు



- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** రైతులు సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పంతో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వరుణ హోమాలు నిర్వహిస్తున్నట్లు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం 18వ డివిజన్‌లోని శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణ హోమంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం వైష్ణవ ఆలయాల్లో వరుణ హోమాలు, శైవ ఆలయాల్లో సహస్ర ఘటాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులు వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు దైవబలం తోడైతే మరింత మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన దేవాలయాల్లో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వరుణ హోమం నిర్వహించడం ఆనందంగా ఉందని గళ్ళా మాధవి అన్నారు. భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. దేవదేవుని ఆశీస్సులతో రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.

## ఎల్ నినో ప్రభావం తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలి : చీఫ్ విప్ జీవీ



- మదమంచిపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో వరుణ యాగం

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** మండలం మదమంచిపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన వరుణ యాగంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు తొలగి, సమృద్ధిగా వర్షాలు కురవాలి పాడిపంటలు సమృద్ధిగా పండి, రైతన్నలు సంతోషంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ ఉత్సవం



- అంగన్‌వాడీ కార్యకర్తలు,సిబ్బందిని అభినందించిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**అమృతలూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అమృతలూరు మండలం కూచిపూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'అంగన్‌వాడీ ఉత్సవం' నిర్వహించారు. కార్యక్రమానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరై చిన్నారులు, తల్లులతో మాట్లాడి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు.

చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రీ-స్కూల్ విద్య, సమగ్ర అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య పరీక్షలు, ప్రీ-స్కూల్ కార్యకలాపాలు సక్రమంగా అందుతున్న తీరును పరిశీలించారు. పిల్లల ఎదుగుదలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చాలని సూచించారు. అంగన్‌వాడీ ఉత్సవంలో భాగంగా చిన్నారులకు ఆటలు, పాటలు, చిత్రలేఖనం, ఇతర సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించి పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు.

చిన్నారులు, మహిళలు, గ్రామీణ ప్రజలకు సంక్షేమ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, తల్లులు, చిన్నారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## శ్రీశైలంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు



○ మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వానం

**అమరావతి, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరు కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కు దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు మంత్రి లోకేష్ కు వేదాశీర్వచనం చేశారు. దేవాలయ అధికారులు శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల చిత్రపటం, ప్రసాదాలను అందించారు. మంత్రి లోకేష్ ను కలిసి ఆహ్వానం పలికిన వారిలో ఆలయ బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈవో యం.శ్రీనివాసరావు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

○ ఏపీఎస్ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్

**అమరావతి, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్టీసీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎస్ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని 26 జిల్లాలు, 129 డిపోల పరిధిలో సుమారు 8,600 మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, క్లీనర్లు, సెక్యూరిటీ, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆస్పత్రి సిబ్బందిగా 5 నుంచి 15 ఏళ్లుగా పనిచేస్తున్నారని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు తెలిపారు. స్త్రీ శక్తి పథకం అమలుతో అదనంగా పెరిగిన ప్రయాణికుల భారాన్ని కూడా ఔట్సోర్సింగ్ సిబ్బంది మోస్తున్నారని పేర్కొన్నారు.

ఇప్పటికే పనిచేస్తున్న 8,600 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులను వయోపరిమితి సడలింపుతో రెగ్యులర్ చేయాలని, ఆర్టీసీలోని 15 వేల ఖాళీల భర్తీలో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని యూనియన్ కోరింది. రెగ్యులర్ చేసే వరకు సంస్థ నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం స్పందించకపోతే ఏపీ పీటీడీ జేఏసీతో కలిసి విజయవాడలోని ఆర్టీసీ హెడ్ ఆఫీస్ వద్ద రాష్ట్రవ్యాప్త పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించింది.

## చావలి వాలేశ్వర స్వామి ఆలయంలో వరుణ యాగం



○ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రత్యేక పూజలు

**వేమూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు సమృద్ధిగా అందాలని ఆకాంక్షిస్తూ వేమూరు మండలం చావలి గ్రామంలోని శ్రీ వాలేశ్వర స్వామి దేవస్థానంలో వరుణ యాగం నిర్వహించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మంగళవారం ఉదయం 6.54 గంటలకు ఒకేసారి నిర్వహించిన వరుణ యాగంలో భాగంగా చావలిలో జరిగిన కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కాలువలు, జలాశయాలు నిండాలని, రైతులకు వ్యవసాయానికి అవసరమైన నీరు సమృద్ధిగా లభించాలని ఆకాంక్షించారు. ప్రజలకు సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని ప్రార్థించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, ప్రజల సుఖసంతోషాల కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఆలయాల్లో వరుణ యాగాలు నిర్వహించినట్లు తెలిపారు.

## వీవీఐటీలో 'ఐక్యా 2కే26' సాంకేతిక సదస్సు



**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో (వీవీఐటీ) ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 'ఐక్యా 2కే26' సాంకేతిక సదస్సు ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో సుమారు 30 కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చెందిన 1,400 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు వీవీఐటీ ప్రో-చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. డీఆర్‌డీవో హైదరాబాద్ శాస్త్రవేత్త పార్థరాజ్ త్రిపాఠి ముఖ్యఅతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. సదస్సులో 'గెలాక్టిక్ సర్క్యూట్ ఫోర్జ్', 'క్రిప్టిక్ ఎన్క్రిప్షన్', 'కోడ్ ఫోర్స్ అవేకన్' సహా 15 సాంకేతిక అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా పార్థరాజ్ త్రిపాఠి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు సాఫ్ట్ స్కిల్స్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గేట్, యూపీఎస్సీ వంటి పోటీ పరీక్షలను లక్ష్యంగా చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేయాలని, లక్ష్యాలను చేరుకునే వరకు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో వీవీఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జున్ రెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఇనాముల్హాక్ షేక్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. భానుమూర్తి, ఐఈటీఈ కోఆర్డినేటర్ డాక్టర్ కె. వరప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి, ప్రధానిగా 25 ఏళ్ల మోడీ పాలన చరిత్రాత్మకం

○ సంక్షోభ సమయంలో దేశంలో పగ్గాలు చేపట్టిన నేత

○ ప్రజల్లో నూతన చైతన్యం, జవసత్వాలు నింపిన దృఢ నాయకుడు

○ 21వ శతాబ్దపు వికసిత భారత వైతాళికుడు

○ బీజేపీ జాతీయ నేత, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా 25 ఏళ్ల పాటు నరేంద్ర దామోదర్‌దాస్ మోడీ అందించిన సేవలు నిరుపమానమైనవని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. 21వ శతాబ్దపు ప్రారంభంలో అక్టోబర్ 7, 2021న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోడీ 13 ఏళ్ల తర్వాత మే 26, 2014న ప్రధాన మంత్రి అయ్యారు. ఈ రెండు కీలక పదవుల్లో మోడీ బుధవారం(అక్టోబర్ 7) 25 ఏళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా మంత్రి నేడొక పత్రికా ప్రకటనలో మోడీ పయనాన్ని విశ్లేషించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా పలు సత్ఫలితాలను సాధించి, దేశ ప్రజల ఆశాజ్యోతిగా నిలిచి ప్రధానిగా దేశంలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించి వికసిత భారతం వైపు నడిపిస్తున్న వైతాళికుడు మోడీ అని మంత్రి పేర్కొన్నారు.

**సంక్షోభానికి ప్రజలు కనుగొన్న పరిష్కారం మోడీ:** 2014కు ముందు 30 ఏళ్లుగా కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలతో నెలకొన్న రాజకీయ, పాలనా పరమైన అస్థిరతల కారణంగా దేశ ప్రజల్లో నిరాశ, నిస్పృహలు ఏర్పడి భవిష్యత్తు పట్ల అపనమ్మకం చోటుచేసుకున్న తరుణంలో దేశ ప్రజలు నరేంద్ర మోడీని ప్రధానిగా ఎన్నుకున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తు చేశారు. 13 ఏళ్లుగా గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ సేవలు, సాధించిన ఫలితాలను గుర్తించిన దేశ ప్రజలు తమ ఆశలు, ఆకాంక్షల సాకారానికి మోడీయే సరైన నాయకుడని ఎలుగెత్తి చాటారని మంత్రి అన్నారు.

'వైబ్రెంట్ గుజరాత్ 'రూపశిల్పి మోడీ దేశాన్ని 'వైబ్రెంట్ ఇండియా' గా మారుస్తారని విశ్వసించిన ప్రజల ప్రగాఢ నమ్మకాన్ని గత 12 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోడీ నిలబెట్టుకున్నారని మంత్రి తెలిపారు.

ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా తన మాటలు, చేతలతో దేశ ప్రజల్లో నైరాశ్యాన్ని తొలగించి, తమ భవిత పట్ల విశ్వాసంతో, ఆత్మస్థైర్యంతో సమిష్టిగా భారతావనిని 21వ శతాబ్దంలో వికసిత భారతం వైపు నడిపిస్తున్న ప్రగతి రథ సారథి నరేంద్ర మోడీ అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభివర్ణించారు.

**మోడీ ప్రత్యేకతలు :** ఆరేళ్ల వయసు నుంచి ఆర్‌యస్‌యస్ కార్యక్రమాలతో అనుసంధానమై అనంతరం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మోడీ దేశ నాగరికత, సంప్రదాయాలు, విలువలను పూర్తిగా ఆకళింపు చేసుకొని ప్రతి పౌరుడు 'నేను భారతీయుడిని' అని గర్వంగా చెప్పుకునే దిశగా కృషి చేస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. దేశ పౌరులంతా ఒకే తాటిపై నడవాలని, భిన్నత్వంలో ఏకత్వం కనపడాలని, వినపడాలని మోడీ అభిలాష అని మంత్రి అన్నారు. ఆలోచనల్లో స్పష్టత, నిర్ణయాలు తీసుకొని అమలు చేయడంలో దృఢత్వం మోడీ ప్రత్యేకతలని, ట్రిపుల్ తలాక్ రద్దు, 370 అధికరణ రద్దు, జీయస్టీ సంస్కరణలు, చొరబాటుదారులపై సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సింధూర్, విదేశీ వ్యవహారాల నిర్వహణ ఇందుకు కొన్ని తార్కాణాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

**ప్రగతి చిహ్నాలు :** దేశ శీఘ్రతర ఆర్థికాభివృద్ధికి భారీ స్థాయిలో పలు మౌలిక వసతుల విస్తరణ, ప్రపంచంలో నాలుగవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం ఆవిర్భావం, స్వచ్ఛ భారత్ మిషన్ కింద దేశంలో 12 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం, పేదలకు 4 కోట్ల గృహ నిర్మాణం, 10 కోట్ల మంది మహిళలకు ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు, దాదాపు 60 కోట్ల మంది మహిళలకు బ్యాంకు ఎకౌంట్లు, డీబీటీ ద్వారా లబ్దిదారులకు లక్షలాది కోట్ల ప్రత్యక్ష నగదు బదిలీ, ఎయిమ్స్, ఐఐటిలు, ఐఐఎంలు, ఎన్ఐటిలు, వైద్య కళాశాలల భారీ విస్తరణ, 25 కోట్ల మంది పేదరికాన్ని అధిగమించడం ప్రధాని మోడీ ఆలోచనలు, అమలుకు ప్రత్యక్ష తార్కాణాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

అంతరిక్షం, సాంకేతిక విజ్ఞాన వినియోగం, పారిశ్రామిక మరియు రక్షణ పరికరాల ఉత్పత్తి వంటి పలు రంగాల్లో దేశం మోడీ పాలనలో భారీ ప్రగతిని సాధించిందని మంత్రి తెలిపారు. డిజిటల్ చెల్లింపుల్లోనూ, స్టార్టప్‌ల ఏర్పాటుల్లో కూడా దేశం అగ్ర స్థానంలో నిలబడడానికి మోడీ దార్శనికత కారణమని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

13 ఏళ్ల గుజరాత్ పాలనతో దేశ ప్రజల ఆశాజ్యోతిగా ఆవిష్కారమైన నరేంద్ర మోడీ గత 12 ఏళ్లుగా ప్రధాన మంత్రిగా దేశ ప్రజలను ఆత్మస్థైర్యంతో కూడిన నవ చైతన్యంతో జాగృతం చేసి సమిష్టిగా వికసిత భారతం వైపు వడివడిగా అడుగులు వేసేలా సమర్థవంతమైన నాయకత్వాన్ని అందిస్తూ నవ భారత వైతాళికునిగా పేరుగాంచారని మంత్రి శ్లాఘించారు.

## రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో నేడు రాష్ట్రవ్యాప్తంగా సేవా జ్యోతి యాత్ర



**విజయవాడ, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అక్టోబర్ 7న రాష్ట్రవ్యాప్తంగా 'సేవా జ్యోతి యాత్ర' నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ తెలిపారు. ప్రతి జిల్లాలో భారీ బైక్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలో ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో యామినీ శర్మ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం సంక్షేమం, జాతీయ భద్రత, ఆర్థిక అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దేశ ప్రజలందరినీ ఒకే కుటుంబంగా భావిస్తూ 'సబ్‌కా సాత్-సబ్‌కా వికాస్-సబ్‌కా విశ్వాస్-సబ్‌కా ప్రయాస్' స్ఫూర్తితో పాలన సాగుతోందని పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా కేంద్రం పనిచేస్తోందన్నారు.

సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రక్తదాన శిబిరాలు, అంగన్‌వాడీ కార్యక్రమాలు, యువత కోసం ఇన్నోవేషన్ కార్యక్రమాలు తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టార్టప్‌లు, ఇన్నోవేషన్, నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు రూ.5.4 కోట్ల ప్రైజ్ మనీతో ఇన్నోవేషన్ ఛాలెంజ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు నేరుగా వివరించడంతో వాటిపై అవగాహన పెరిగిందన్నారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని యామినీ శర్మ తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాయలసీమలో హార్టికల్చర్ క్లస్టర్‌కు సంబంధించిన పెట్టుబడుల ప్రణాళికపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన సందర్భంగా చర్చలు జరిగాయని తెలిపారు. రాష్ట్రంలో కేంద్ర సహకారంతో చేపడుతున్న ప్రాజెక్టులు, పెట్టుబడులకు సంబంధించిన గణాంకాలను అధికారిక వివరాల ఆధారంగా వెల్లడిస్తామని పేర్కొన్నారు.

సేవా జ్యోతి యాత్ర, బైక్ ర్యాలీలను ప్రజలకు విస్తృతంగా చేరేలా మీడియా సహకరించాలని యామినీ శర్మ కోరారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను భాగస్వామ్యం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్ పాల్గొన్నారు.

## ఒడిశా సీఎంకు పీవీఎన్ మాధవ్ ఘన స్వాగతం



**విశాఖపట్నం, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ డేగా విమానాశ్రయానికి చేరుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయంలో మాఝీకి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు.

ఏపీ, ఒడిశా రాష్ట్రాల మధ్య చారిత్రక, సాంస్కృతిక, సామాజిక సంబంధాలతో పాటు భౌగోళికంగా కూడా సన్నిహిత అనుబంధం ఉందని మాధవ్ పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సత్సంబంధాలు, పరస్పర సహకారం భవిష్యత్తులో మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలు, మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో పరస్పర సహకారం రెండు రాష్ట్రాల ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చేలా ఉంటుందని అన్నారు.

రెండు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలు, అభివృద్ధి లక్ష్యాల సాధనలో సమన్వయం, సహకారం కీలకమని మాధవ్ తెలిపారు. ఏపీ, ఒడిశా ప్రభుత్వాలు, ప్రజల మధ్య పరస్పర సంబంధాలు మరింత విస్తరించేందుకు అవసరమైన చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు.

# మంచి మార్కులతో లోకేశ్‌కు గిఫ్ట్ ఇస్తారా ?

○ మీరు అడిగినవన్నీ చేస్తా

○ పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తా

○ అదనపు తరగతి గదులు నిర్మిస్తా

○ ఏ అవసరం వచ్చినా ముందుంటా ?

○ విద్యార్థులతో ముచ్చటించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

○ డీఈవోతో కలిసి భారత్ పేట పాఠశాలను పరిశీలన



**గుంటూరు, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** "పాఠాలు బాగా చదువుతున్నారా ? అర్థమవుతున్నాయా ? స్కూల్ బ్యాగ్స్ బాగున్నాయా ? మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉందా ? ఇంకా మీ పాఠశాలకు ఏమి కావాలి ? పాఠశాలకు మీరు అడిగినవన్నీ చేస్తాను. మంచి మార్కులు తెచ్చుకుని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కు గిఫ్ట్ ఇస్తారా ?" అని విద్యార్థులతో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ముచ్చటించారు. మంగళవారం స్థానిక 54వార్డులో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. అందులో భాగంగా భారత్ పేట మున్సిపల్ పాఠశాలను డీఈవో షేక్ సలీం బాషా, ఎంఈవో ఖుద్దూస్ తో కలిసి సందర్శించారు. పాఠశాలలో మరుగుదొడ్లు, వంట గది, పాఠశాల ప్రాంగణం, తరగతి గదులను పరిశీలించారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాటామంతీ కలిపారు. పాఠశాలలో విద్యా విధానం, విద్యార్థుల ప్రోగ్రెస్ గురించి ఆరా తీశారు. పాఠశాలకు ఏమేమి సదుపాయాలు కావాలో ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 600 మంది వరకు విద్యార్థులు ఉన్నారని, అదనపు తరగతి గదులు అవసరమని ఎమ్మెల్యే నసీర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై డీఈవో, ఎంఈవోలతో ఎమ్మెల్యే నసీర్ చర్చించారు. వీటితోపాటు పాఠశాలలకు అవసరమైన మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో పాఠశాలను తీర్చిదిద్దుతామని చెప్పారు. విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. విద్యా కిట్లు, పాఠ్య పుస్తకాలు అందించడంతోపాటు తల్లికి వందనం ద్వారా విద్యార్థుల భవితకు భరోసానిస్తున్నట్లు చెప్పారు. కేవలం విద్య మాత్రమే కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్ డెవపల్ మెంట్ లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

**54 వార్డులో పర్యటన**

స్థానిక కూటమి నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ 54వ వార్డులో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి శానిటేషన్, మంచినీటి సరఫరా వంటి అంశాలపై ఆరా తీశారు. కొందరు నీరు దుర్వాసన వస్తున్నాయని ఫిర్యాదు చేయడంతో వెంటనే సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు.

నీటిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, క్లోరినేషన్ సక్రమంగా జరగాలని ఆదేశించారు. శానిటేషన్ విషయంలో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. డ్రెయిన్లలో సిల్ట్ తీత పనులు చేపట్టాలని సూచించారు.

# ఎస్ఆర్ఎంలో అమరావతి సాహిత్య ఉత్సవాలు

○ నేడు ఏపీ కల్చరల్ కమిషన్ చైర్ పర్సన్ పొడపాటి తేజస్విని చేతుల మీదుగా ప్రారంభం

○ 9న ముఖ్య అతిథిగా సినీ హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మానందం







**అమరావతి, అక్టోబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్):** అమరావతి సాహిత్య ఉత్సవాల నిర్వహణకు ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సిద్ధమైంది. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు సాహిత్య ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలి రోజు అక్టోబర్ 7న ఉదయం 10 గంటలకు రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని, గుంటూరు కలెక్టర్ సాయి కాంత్ వర్మ లు హాజరై ఉత్సవాలను ప్రారంభించనున్నారు. చివరి రోజు అక్టోబర్ 9న సాయంత్రం 3 గంటలకు ప్రముఖ సినీ హాస్యనటుడు పద్మశ్రీ కన్నెగంటి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్సవాల ప్రాధాన్యతపై ప్రసంగించనున్నారు.

భాషా, సాహిత్య రంగాల్లో నిష్ణాతులైన కవులు, సాహితీవేత్తలు, విద్యావేత్తలు, విమర్శకులను ఒకే వేదికపైకి తీసుకురావడంతో పాటు వివిధ భాషలను, సాహిత్య సంప్రదాయాలను ప్రోత్సహించడమే అమరావతి సాహిత్య ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని ఉత్సవాల కన్వీనర్ డాక్టర్ ఆర్గా బసు తెలిపారు. సాహిత్యం, కళలు, సంస్కృతి, సమకాలీన ఆలోచనలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ అ-ర్థవంతమైన చర్చలకు, సరికొత్త ఆలోచనా విధానాలకు మార్గం సుగమం చేసే బృహత్తర వేదికగా అమరావతి లిటరేచర్ ఫెస్టివల్ నిలవనుందని పేర్కొన్నారు.

**'మారుతున్న ప్రపంచానికి కథలు' నినాదంతో ఉత్సవాలు**

'మారుతున్న ప్రపంచానికి కథలు' అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాష, సాహిత్యంపై బృంద చర్చలు, వివిధ రాష్ట్రాల భాషా సాహిత్యాలపై చర్చా గోష్టులు, సందేశాలు, సలహాలు, సూచనలు ఉంటాయని యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ తెలిపారు. భాషా, సాహిత్య రంగాల్లో ప్రముఖులైన వివిధ ప్రాంతాల రచయితలు, సాహితీవేత్తలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారని, దీంతో కార్యక్రమాలు వైభవంగా జరగనున్నాయని వివరించారు.

కర్ణాటకకు చెందిన మిని కృష్ణన్, కేరళకు చెందిన అప్పు పెన్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన చార్బక్ దీప్తా, తెలంగాణకు చెందిన పూర్ణిమా తిమ్మారెడ్డి, తమిళనాడుకు చెందిన సంహితా సిన్హా, న్యూఢిల్లీకి చెందిన దినేష్ శర్మ తదితర ప్రముఖ సాహితీవేత్తలు ఉత్సవాలకు హాజరుకానున్నారు.

ఈ ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా ప్రముఖ కళాకారుడు బేగర్ శివకుమార్ దర్శకత్వంలో యక్షగాన ప్రదర్శన నిర్వహించనున్నట్లు డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. సంగీతం, నృత్యం, సంభాషణలు, నాటకీయ అభినయంతో కర్ణాటకకు చెందిన రంగస్థల, కథన సంప్రదాయాలను ఈ ప్రదర్శన ద్వారా ప్రేక్షకులకు పరిచయం చేయనున్నట్లు వివరించారు. అదేవిధంగా 'ప్రహేళిక' పేరిట వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు సాహిత్య అంశాలపై క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఉపకులపతి సతీష్ కుమార్ తెలిపారు.

**9న సినీ హాస్యనటుడు బ్రహ్మానందం రాక...**

ఈ ఏడాది అమరావతి సాహిత్య ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మానందం పాల్గొననున్నారు. తెలుగు అధ్యాపకుడిగా, నాటక రంగ ప్రయోక్తగా, నటుడిగా, మిమిక్రీ కళాకారుడిగా, చిత్రకారుడిగా విభిన్న కళారంగాల్లో విశేష ప్రతిభను కనబరిచిన డాక్టర్ బ్రహ్మానందం తెలుగు భాష, సాహిత్యంపై ప్రసంగించనున్నారు. అక్టోబర్ 9న సాయంత్రం 3 గంటలకు ఆయన యూనివర్సిటీకి చేరుకుని సాహిత్య ఉత్సవాల్లో పాల్గొననున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కల్లూరి వినాయక్ తెలిపారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com